# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**

**డి.జె. బాలకృష్ణ లాల్**

**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**

**మిస్.పి. ఇందిరాదేవి**

**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**

**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 30 Issue 6

No.of Pages 40

FEBRUARY 2011

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


## ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 5 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీ అభిభాషణ | 9 |
| సన్నిధిలో సంభాషణ | 12 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 15 |
| ఉపాసన అంటే ఏమిటి? | 16 |
| సాధనోపదేశ చతుష్టయము | 18 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 21 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ | 23 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 25 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 27 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 29 |
| ఆటవీకుని అనన్య భక్తి | 31 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 33 |
| అమరనీతి నాయనార్ | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**యోऽసౌ ప్రయత్నమానః సాధనా చతుష్టయ సంపన్నః నిరస్త చిత్తదోషః**
**స్థిరీ కృత చిత్తవృత్తిః సాత్విక గుణవిశిష్టః స ఏవ జ్ఞానమర్హతి ॥**

సాధనాచతుష్టయ సంపన్నుడై మనస్సులోని మాలిన్యాలను ప్రక్షాళన చేసుకుని, మనోచాంచల్యాన్ని నిగ్రహించి సాత్విక గుణాలనలవరచుకొన్న సాధకుడు మాత్రమే జ్ఞానయోగ పథానికి అర్హుడు అని ఉపనిషత్తు ప్రబోధిస్తోంది. అయితే వ్రతాలు, దానములు, యజ్ఞములు, తీర్థయాత్రలు, తపస్సు మొదలుగు బాహ్యకర్మలు స్వర్గప్రాప్తికేకాని, ముక్తికి తోడ్పడవు అని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాక మహాత్ములు కూడ బోధిస్తున్నారు. శ్రీశంకర భగవత్పాదులువారు బ్రహ్మజ్ఞాన ఫల ప్రాప్తికి వైరాగ్యము, శమాదిషట్క సంపత్తి గల ముముక్షువే అధికారి అని శలవిచ్చారు.

సాధనా చతుష్ట సంపన్నుడైన ముముక్షువు సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన ఆదేశించిన మార్గంలో తత్వవిచారణ చేయాలి. మనస్సు జడమే. దానికి ఆద్యంతాలు ఉన్నాయి. విషయ వస్తులవైపు పరుగెత్తే చంచలమైనది. శ్రీబాబూజీ మహారాజ్ ప్రబోధిస్తూ సాధకులు ఏ ఆశ్రమ ధర్మంలో ఉన్నా మీ విధులను మీరు నిర్వహిస్తూ మీ మనస్సుని మీరు నమ్మిన సద్గురుమూర్తి దివ్యచరణార విందముల యందునిల్పినా లేక ఆయన దివ్య చరణారవిందాలను మీ మనస్సులో నిలుపుకున్నా జపతములతో పనిలేదు అని అన్నారు.

అంతేకాదు ఇంకా బోధని కొనసాగిస్తూ సంసారమనే ఎండమావుల సాగరాన్ని దాటటానికి సాధన అనే నావ ఎక్కి ఆ సాగరంలో మునిగిన వానికి సాగరము లేదు, సాధనా లేదు. అయితే సాధన అవసరం లేదని మాత్రం అపార్థం చేసుకోకూడదు. పరిపూర్ణ విశ్వాసము అనే నావయే సాధనా పరికరము. శ్రీకృష్ణపరమాత్ముడు భగవద్గీతలో 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని బోధించారు. సద్గురుమూర్తికి సంపూర్ణ శరణాగతి పొందిన సాధకునికి ఆత్మ సాక్షాత్కారము తథ్యం. సాధనా చతుష్టయ సంపన్నుడైన సాధకుని మనస్సు అజ్ఞాన రహితమై తాను గుర్తింపబడటమేగా సాధకులెవరైనా ఆశించేది. *

# అమ్మ ఆశీస్సులు

శ్రీసద్గురుదేవుల పరమానుగ్రహంతో ధనుర్మాస వ్రతము భోగి పండుగ, సంక్రాంతి పండుగలతో పూర్తయినవి. శ్రీగోదా రంగనాధస్వామి కళ్యాణము, శ్రీరుక్మిణీ కృష్ణసార్వభౌముల లీలా కళ్యాణములు ప్రవచన పూర్వకముగా రంగరంగవైభవముగా శ్రీసద్గురుదేవులు ప్రసాదించారు. ఎందరెందరో మహాభక్తులందరూ శ్రీ భోగిపండుగకు రావటము, భోగిపళ్ళు బాలకృష్ణస్వామికి అలంకరించుకుని మనస్సులన్నీ ఆనందభరితంతో ప్రసాదం తీసుకుని వారి ఊళ్ళకు బయలుదేరి వెళ్ళారు. ఇదంతా శ్రీసద్గురుదేవులు ప్రసాదించిన శ్రీవారి దయ అనుగ్రహమే కదా! అందుకనే (కవిగారు) శ్రీపరిమి సుబ్రహ్మణ్య భాగవతార్ వ్రాసిన శ్రీకాళీప్రసాదాష్టకంలో ఉన్నట్లు ...........

**ఏనాడేమో భగవత్పదాబ్జముల నెంతే బట్టు కొన్నారమో**
**ఆనాడే చరితార్థ జన్మలము మేమైనార మెట్లేని బా**
**బూ! నీ దృష్టి బడం ద్యజింప వెటులం బోనీక ప్రేమించి సు**
**జ్ఞానం బీగల సత్యమూర్తివి కదా కాళీప్రసాద ప్రభూ!**

ప్రభుని దృష్టిలో ఉంటే చాలు ఎటూ బోనీయని సుజ్ఞానము నీయగల సత్యమూర్తి ఆత్మజ్ఞానమును, ఆత్మదృష్టిని ప్రసాదించే శ్రీసద్గురుదేవులు శ్రీప్రసాదదేవులు సమర్థులు.

ఇంతలో శ్రీసద్గురుదేవుని అనుగ్రహంతో ఫిబ్రవరి 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు తూర్పు గోదావరిజిల్లా 'తుని పట్టణము' లో సప్తాహ్నిక కార్యక్రమ మహోత్సవములు జరుగును. ఇందులో పంచాహ్నికముగా శ్రీసద్గురు చండీ రుద్ర యాగము, సత్సంగ సమావేశములు, త్రయాహ్నిక సాధు ధర్మసమ్మేళనము, అయిదురోజులు షోడశాక్షరీ నామము, హరినామ సంకీర్తనము, సామూహిక సూర్యనారాయణమూర్తి నమస్కారములు, పూజలు, రుద్రాభిషేకములు, కుంకుమపూజలు. భక్తులకు సేవలన్నిటినీ శ్రీసమర్థ సద్గురుదేవులు ప్రసాదించారు.

ప్రతి భక్తునికీ ఇంద్రియాలు కలిగినందుకు శ్రవణసేవ, సందర్శనసేవ, సంసేవనము, సంకీర్తనము, సుతీర్థసేవ, సుప్రసాదసేవ, అర్చనసేవలు, దానధర్మమునకు ఇటువంటి ఎన్నెన్నో ధర్మమైన సేవలను ప్రతిభక్తుడూ,

గృహస్థుడూ చేసి ఆచరించి తరించవచ్చు. ఇవి ఈనాడు కొత్తగా పెట్టినవి కాదు. సనాతనంగా మన పెద్దలెందరో ఆచరించి మనకందించినవి.

**శ్రవణం, కీర్తనం, విష్ణో: స్మరణం పాదసేవనం**
**అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనమ్ ॥**

ఇన్ని సేవలతో ఇమిడ్చి యాగ కార్యక్రమాన్ని శ్రీసద్గురుదేవులు ప్రసాదించారు. ఇందులో మనకు ముఖ్యమైనది ఆకలి. అన్నమో రామచంద్రా! అంటాము. అందుకని అన్నదానం రెండుపూటలా ఇక ప్రాతఃకాలంలో భోగం నివేదన ప్రసాదవితరణ. గృహస్థులకు ఎంతో పండుగ ఈ సేవలతో మీ మీ ద్రవ్యములను సద్వినియోగపరచుకునే భాగ్యమునకు అవకాశమిచ్చినారు.

**సాధూనాం దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనమ్ ।**
**సంభాషణం కోటితీర్థ పుణ్యం వందనం మోక్షసాధనమ్ ॥**

ఇహ పరములకు సోపానము సాధుమహాత్ముల దర్శన, స్పర్శన, సంభాషణ, వందనములు మనకు యాగములో ముందుగానే లభిస్తున్నవి. 4వ తారీఖన సాయంత్రం 4గంటల నుండి శోభాయాత్రలో తుని వీధులలోనే శ్రీస్వామీజీలు, మాతాజీలతో శ్రీసద్గురుదేవులు అందరికీ దర్శనమిస్తున్నారు.

వేదఘోషలతో వేదమూర్తులందరూ సంకీర్తనతో, నామ నృత్యంతో శ్రీ అవధూతేంద్రస్వామి భక్తమండలివారు ఇంక ఎందరెందరో భక్తుల సంకీర్తనలతో పురమంతా శాంతి కొరకు శోభాయాత్రను తుని శ్రీబాబూ భక్తసమాజ్ వారు నిర్వహించిస్తున్నారు.

5వ, తారీఖు నుండి 7 వరకు సాధుధర్మ సమ్మేళనము, ప్రవచనము, 5వ, తారీఖు నుండి 9 వరకు యాగకార్యక్రమము. 10వ తారీఖున సర్వదేవతా స్వరూపుడైన శ్రీసద్గురు మహరాజ్‌వారికి శ్రీపాదపూజా మహోత్సవముతో ఈ యాగము పూర్తి అవుతుంది.

కనుక భక్తులందరూ ఇంకా మీకు తెలిసినవారందరికీ చెప్పి తీసుకుని ఈ యాగమునకు వచ్చి మనమందరం కలిసి ఆనందోత్సాహములతో ఈ మహదవకాశమును సద్వినియోగపరచుకొందుము గాక! అట్టి భక్తి జ్ఞానములను శ్రీసద్గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక!

- మీ అమ్మ

# సంపాదకీయం

నూతన సంవత్సర వేడుకలతో ప్రారంభమైన జనవరినెల ప్రథమార్ధం చూతవృక్ష ఛాయలో నైమిశారణ్యాన్ని తలపింపజేసే ప్రకృతిలో తిరుప్పావై ముకుందమాల, ఋషులచరిత్రలు, భాగవతం దశమ స్కంధంలోని శ్రీకృష్ణుని లీలలు శ్రవణం చేయటంతో భోగిపండ్లు, సంక్రాంతి వేడుకలతో ఎంతో భక్తిభరితంగా రంగరంగ వైభవంగా ఆనందంగా గడిచిపోతుంది.

సద్గురు మాసపత్రిక పాఠక మహాయశయులలో ఎక్కువమంది శ్రీబాబూజీ మహరాజ్‌తో గాని, శ్రీమాతాజీతోగాని చిరకాలంగా దర్శన, స్పర్శన భాగ్యం కలిగి ఆధ్యాత్మిక అనుభూతులను పొంది ఉంటారు. ఆధ్యాత్మిక సంభాషణలుగాని, సాధనకు సంబంధించిన అంశాలుగాని ఉంటే చక్కగా విచారణ చేసి, మననము చేసిన స్మృతులను వ్రాసి మాకు పంపితే వాటిని సాధ్యమైనంత వరకు సద్గురు మాసపత్రికలో ప్రచురణ చేయటానికి ప్రయత్నిస్తాము.

అవి తోటి సాధకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అంతేకాదు సద్గురుదేవులతో పొందిన భక్తులందరి అనుభూతులు పదిలపరచినట్లైతే, సాధకులెవరైనా ఆ దివ్య స్మృతులను చదివి ఆనందించి తరించటానికి దోహదపడతాయి అనిఅనటంలో సందేహం లేదు.

ఈ ప్రయత్నము వలన సద్గురుమూర్తి సేవకి కేటాయించిన సమయం నిత్యకాలంలో జమ అవుతుంది కదా!

ఇటువంటి ప్రయత్నము వలన ఆసక్తి ఆవేదన పెంపొంది సద్గురు దేవులతో గడపిన విలువైన సమయంలో పొందిన అనుభూతులు గోప్యంగా, రహస్యంగా ఉన్నవి బహిర్గతమయి భక్త మహాశయులందరికీ ఆనందాన్ని కల్గిస్తాయని ఆశిస్తున్నాము.

పరాశర ప్రసాద్

(గౌరవ సంపాదకుడు)

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

మానవుడు ముక్తి పొందాలంటే సన్న్యాసం స్వీకరించవలసిందే అని కొందరు భావిస్తారు. కాని అది సరికాదు. గృహస్థుడుగా వుంటూనే మానవుడు తప్పక తరించవచ్చును. సన్యసించవలసింది మనస్సు. గృహస్థుడుగా ఉంటూనే, సత్యమార్గంలో విధ్యుక్త ధర్మం నిర్వహిస్తూ, ధనాన్ని ఆర్జిస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటూ, నిత్య నైమిత్తిక కర్మలు ఆచరిస్తూ, మనస్సును మాత్రం భగవంతుని యందు నిలిపితే మానవుడు తరించగలడు. మనస్సు సన్యసించటం అంటే ఇదే అర్థము. అలా మనస్సు సన్యసించినపుడు కాషాయ వస్త్రాలతో పనిలేకుండా, గృహస్థుడుగానే మానవుడు తరించవచ్చును. ద్వారకా నాథుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఈ విషయాన్నే నారదునకు ఋజువు చేసి చూపించాడు. ఆ ఉదంతాన్ని యిప్పుడు మనం చెప్పుకుందాము. ఇది నిజంగా జరిగిన విషయమే.



నారదుడు మహాభక్తుడు. అతను నారాయణునికి మనుమడు కూడాను. "నారాయణతత్త్వము, అందులో ఉన్న ఆనందము నాకు తప్ప ఎవరికి తెలుసును? నారాయణ మహిమను నేను ప్రకటన చేయటం వల్లనే కదా ప్రపంచానికి తెలిసింది?" అని నారదునికి ఒకసారి అహంకారంతో కూడిన గర్వం కలిగింది. "అయ్యో! అనన్య చింతనుడైన నా భక్తునికి, యీ అహంకార భావన, బంధమే గదా! దాని వల్ల మళ్ళీ జన్మ అవసరమవుతుంది గదా!" అని భక్తత్రాణ పరాయణుడైన నారాయణుడు ముందే గ్రహించి, దాని నివారణ పథకం కూడా తయారు చేసి ఉంచాడు. అల వైకుంఠ పురంలో మణిమయ సౌధంలో హంస తూలికా తల్పం పైనే పడుకుని ఉన్నా, నారాయణుని ఆలోచన సదా తన భక్తుల రక్షణ మీదనే లగ్నమై ఉంటుంది.ఒకసారి దేవలోకం నుండి నారదుడు శ్రీకృష్ణ దర్శనార్థమై ద్వారకకు వచ్చాడు. పరమాత్మ ఎదురు వచ్చి నారదుని ఆదరించి, "నారదా! నా నామ సంకీర్తనతో నన్నేగాక ముల్లోకాలను మరపింప జేసే నీ భక్తి నిజంగా సాటిలేనిది సుమా! అవును గాని, దక్షిణ దేశంలో ఒక భక్తుడు ఉన్నాడు. వైకుంఠ సత్యనారాయణ అతని పేరు. మహాభక్తుడని అందరూ చెప్పుకుంటున్నారు. భక్తిని పరీక్షించటంలో నీకన్న సమర్థులెవరున్నారు? ఒక్కసారి వెళ్ళి అతని భక్తి ఎంత మాత్రమో తెలుసుకునిరా!" అని నారదుని ఆకాశానికి ఎత్తివేస్తూ మాట్లాడాడు. నారదుడు సరేనని దక్షిణ దేశానికి ఆ భక్తుని యింటికి వెళ్ళాడు.

ఆ భక్తుడు నిరుపేద. ఆరుగురు కొడుకులు, కోడళ్ళతో పెద్ద సంసారం. కొద్దిపాటి భూమి ఉంది. ఎడ్లతో వ్యవసాయం. వేకువ జామునే నిద్రలేస్తూనే "నారాయణా" అంటూ లేచేవాడు. "గోపాలా" అంటూ పాలు పితికే వాడు. "గోవిందా" అంటూ స్నానం చేసేవాడు. "మాధవా! మధుసూదనా" అంటూ మడిదున్నుకునేవాడు. భోంచేసే ముందు, నిద్రపోయే ముందు, యిలా ఏ పని అయినా చేసే ముందు నామం స్మరించేవాడు. అతిథి అభ్యాగతులను నారాయణ స్మరణతోనే ఆదరించేవాడు. అతను నారదుని ఎంతో మర్యాదతో, భక్తితో, ఆహ్వానించి, ఆదరించాడు. నాలుగు రోజులు అతని యింట్లో ఉండి అతనిని బాగా గమనించి, "యిక వెళ్ళివస్తా"నని నారదుడు బయల్దేరాడు. "గొల్లవాళ్ళకు వేపకాయంత వెట్టి ఉంటుందంటారు. ఎంత భగవానుడైనా, కృష్ణయ్య గొల్లవాడే గదా! వెర్రి కాకపోతే, యీపాటి పనికి ఆ సామాన్య భక్తుని యింటికి నన్ను పంపటమేమిటి? ఇహ, యింకోసారి "ఆ రాధ గొప్ప భక్తురాలు, ఆమె యింటికి వెళ్ళిరా" అని పంపినా పంపవచ్చు. అయినా నావంటి దివ్యజ్ఞాన సంపన్నుడు ఒక ఆడదాని వద్దకు వెళ్ళటమేమిటి?" అని అనుకుంటూ అహంకారానికి లోనయ్యేసరికి, మాయలో పడ్డాడు. ఇహ కూనగాసి గొట్టాలం మనబోటి వాళ్ళ సంగతేమిటి? అందుకే అనుక్షణం జాగరూకులమై, అహంకారమనే అంధకారంలోను, మమకారమనే మత్తులోను, మనలను పడనీయకుండా రక్షించమని ఆ ప్రభువును సదా ప్రార్థించుకోవాలి.

నారదుడు ద్వారకకు రాగానే, శ్రీకృష్ణ పరమాత్మ ఎదురుగా వచ్చి, "రా నారదా! ఎంతో శ్రమపడి వచ్చావు. ఇంతకూ ఆ భక్తుని సంగతి ఏమిటి?" అని అడిగాడు. "అతను మంచివాడే. తన పనులు తాను చేసుకుంటూ, మధ్యలో అప్పుడప్పుడు నిన్ను స్మరించుకుంటూ ఉంటాడు" అన్నాడు నారదుడు. "అంతేగదా! మహాభక్తుని అందరూ చెప్పుకుంటుంటే, భక్తిలో నీతో పోటీ పడతాడేమోనని భయపడ్డాను. అయినా, తైలధారవలె క్షణం కూడా ఆగకుండా నిర్విరామంగా నామస్మరణ చేసే నీతో, భక్తిలో ఎవరు సరి తూగగలరు?" అని మరింత ఉప్పొంగింపజేసి "నారదా! ఇప్పుడు ద్వారకకు ఒక గొప్ప అరిష్టం చుట్టుకున్నది. (నీకు అహంకారమనే అరిష్టం చుట్టుకున్నది) ఆ అరిష్టం తొలగటానికి ఒకే ఒక మార్గం ఉన్నది. అస్ఖలిత బ్రహ్మచారి అయిన ఒక మహాభక్తుడు, అంచుల వరకు నిండుగా ఉన్న ఒక తైలపాత్రను అరచేతిలో ఉంచుకుని, ఒక చుక్క అయినా తొణకకుండా ద్వారక చుట్టూ, నారాయణ స్మరణ చేస్తూ, మూడుసార్లు నగర ప్రదక్షిణం చెయ్యాలి. ఈ పనికి నిన్ను మించిన భక్తులెవరున్నారు? కాని జాగ్రత్త ఒక చుక్క తైలం తొణికినా, నీ అరచెయ్యి జిడ్డు అయినా, (నీకు పట్టిన అహంకారపు జిడ్డు తొలగించటానికేలే యీ పరీక్ష), నీవు

నారాయణ స్మరణ ఒక క్షణం మరచినా, ఆ అరిష్టం వలన ద్వారక దొంగల దోపిడికి గురి అయి ఎంతో నష్టపోతుంది (నీ యింద్రియ చోరులు జ్ఞాన రత్నాన్ని దొంగిలించబోతున్నారు. దాని నుండి నిన్ను కాపాడటానికేలే యీ ఘటన) కనుక నువ్వు ఎంతో అప్రమత్తుడవై యీ ప్రదక్షిణలు పూర్తి చెయ్యాలి. నీ మేలు మరచిపోనులే (నువ్వు మరువలేని మేలు చేస్తానులే) అని నారదుని చేతిలో తైలపాత్ర ఉంచాడు.

నారదుడు తైలపాత్రను చేతులో ఉంచుకొని ద్వారక చుట్టూ ప్రదక్షిణం మొదలుపెట్టాడు. అతని దృష్టి అంతా ఆ తైలం ఎక్కడ ఒలుకుతుందో అనే భయంతో దాని మీదనే ఉన్నది. "ఇదేమిటి, యిటువంటి పనికి ఒప్పుకున్నాను? కృష్ణయ్య మాటలతో నన్ను సమ్మోహపరుస్తుంటే, నాకూ మతిలేక పోయింది. ఈ తైలమే తొణికితే, ద్వారక మాట ఎలా ఉన్నా, యీ పని పాడు చేసిన పాపం నాకు చుట్టుకుంటుందేమో" అనుకుంటూ తైలపాత్ర స్మరణలో మునిగిపోయాడు. ఎలాగో మూడు ప్రదక్షిణాలు పూర్తి చేసి వచ్చిన నారదునితో శ్రీ శ్రీకృష్ణుడు "నారదా! నీవు నాకు, ద్వారకకు కూడా ఎనలేని మేలు చేశావు. తిరుగుతూ ఉన్నంత సేపూ నారాయణ స్మరణ చేస్తూనే ఉన్నావు కదూ?" అని అడిగాడు.

నారదుడు "నారాయణ స్మరణకు అవకాశం ఎక్కడయ్యా మహానుభావా! ఏ క్షణంలో ఏమరుపాటు వల్ల తైలం తొణుకుతుందో, కొంప మునుగుతుందో అని దృష్టి, మనసు అంతా తైలపాత్ర మీదనే ఉంటే, యిక నారాయణ స్మరణ ఏం చేయను?" అన్నాడు. శ్రీకృష్ణ పరమాత్మ నవ్వుతూ "నారదా! ఈ ఒక్క తైలపాత్ర మీద దృష్టి చేతనే నీవు నా నామస్మరణ మరచావే? మరి సంసార సాగరంలో మునిగి తేలుతూ, ధర్మ మార్గంలో నడుస్తూ, ఆర్జన చేస్తున్న దానిని సంసారానికి సద్వినియోగం చేస్తూ, అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ, దారాపుత్రాదులను పోషిస్తూ, సంసార సమస్యలతో సతమతమవుతూ కూడా ఆ రైతు నన్ను మరువలేదే? మరి అతని భక్తికి ఏమి తక్కువైంది?" అని అంటూ తన దివ్య స్పర్శతో నారదునికి జ్ఞానం కలిగించాడు. నారదుడు సాష్టాంగ నమస్కారం చేసి "ప్రభూ! నా అజ్ఞానాన్ని అహంకారాన్ని తొలగించటానికి యింత శ్రమపడ్డావా? బుద్ధి వచ్చింది. ఇక ఎన్నడూ నేను భక్తుడనని అహంకరించకుండా, నీ నామం మరువకుండా, నన్ను అనుగ్రహించు, అది నీ అనుగ్రహం వల్లనే సాధ్యం అవుతుంది గాని నా సాధన వల్ల కాదు" అని ప్రార్థించాడు.

అట్టి ద్వారకానాధుని సేవించి తరించండి. భగవానునికి మీ మడి, ఆచారములతో నిమిత్తము లేదు. నిర్మలమైన మనస్సుతో ఆ విశ్వనాధుని విశ్వసించి, ఆయన అవ్యాజ కరుణకు పాత్రులై యీ మానవ జీవితాన్ని సార్థకం చేసుకోండి. ఆ జగన్నాధుడు సర్వదా మిమ్ము కాపాడు గాక!

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

విషయభోగాలను తుచ్ఛంగా ఎంచి, తాను తెలుసుకోవాలని అనుకున్న ఆత్మతత్వం మాత్రమే కావాలని దృఢనిశ్చయం కలిగిన వైరాగ్య సంపన్నుడైన నచికేతుని చూసి యముడు మహదానంద భరితుడైపోయాడు. ప్రాపంచిక సుఖాలిచ్చే 'ప్రేయోమార్గాన్ని' అనిత్యమని ఎంచి వద్దన్నాడు. ఆచరించడం కష్టమైనా, చివరికి మార్పులేనటువంటి శాశ్వత ఆనందాన్నిచ్చే 'శ్రేయో మార్గాన్నే' వరించాడు నచికేతుడు. అటువంటి శిష్యరత్నానికి తన సర్వస్వాన్నీ ఇచ్చి, తనని మించిన వానిగా చేస్తాడు గురుదేవుడు. అదే చేశాడు యమధర్మరాజు. గురుశిష్య న్యాయానికి ఆదర్శం ఈ కఠోపనిషత్తు ద్వారా మనకి తెలిసింది.



ఈ శరీరం ఎప్పటికీ మారిపోయి, నశించిపోయేదే. నశించే దేహం లోపలే మార్పులేని, నశించని వస్తువు ఒకటుంది. అదే ఆత్మ లేక చైతన్యం. 'అది తానుగాని, తనువు తానుకాదు' అనే గురుతుని తెలుపుతారు గురుదేవులు. గురునాధుడు చెప్పిన బోధని జాగ్రత్తగా విని, మననం చేసికొని తు.చ. తప్పకుండా ఆచరించిన వారికి లోటేమిటి? కానీ ఈనాటి మానవులు తాము చాలా తెలివిగా మాట్లాడుతున్నామని అనుకొని 'ఇదంతా మాయ అండీ' అంటారు. ఆ మాయ మన దగ్గరకి రాకుండా వుండే విధానాన్ని మహాత్ములు చెబుతూ ఉంటే ఆచరించవచ్చుగా! దారాపుత్రులు, ధనధాన్యాలు ఇవన్నీ ధర్మపరంగా ఉంటే బంధన కాదు. ఎవరైతే వాటియందు మమకారాన్ని పెంచుకుంటారో వారికి బంధన అవుతాయి.

'ఇన్ని తికమకలు లేవయ్యా ఉన్నది నీ ఒక్కడవేనయ్యా' అని ఆ భగవచ్ఛక్తిని నమ్మితే, మిగిలేది ఆనందమే. నచికేతుడిలాంటి తీవ్ర వైరాగ్యము, పట్టుదల కలిగి వుంటే మనం సాధించలేనిది ఏదీలేదు. అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని సద్గురుమూర్తి ప్రసాదించుదురుగాక!! సుఖీభవ!!

(శ్రీకాళహస్తి శ్రీశుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పంచమ వార్షికారాధన సందర్భంగా జరిగిన సాధుధర్మసమ్మేళనంలో 19.04.2003న శ్రీ మాతాజీవారి దివ్య అనుగ్రహభాషణం)

"ఈ కార్యక్రమాలన్నిటికీ సర్వసాక్షియైన భగవంతుడికీ, అటువంటి భగవత్ స్వరూపులైన మహాత్ములందరికీ, ఇందరిలోనూ ప్రకాశిస్తున్న ఏ సద్గురునాథులయితే వున్నారో అటువంటి చైతన్య స్వరూపులైన పరమాత్మకి నమస్కరిస్తూ... ఆ భగవంతుడు నాకు జోడు జోడు అవకాశాలనిస్తున్నందుకు మహాప్రసాదం.

నిరీక్షించడం మనవంతు; ప్రసాదించడం భగవంతుడి వంతు. ఎవరైతే భగవంతుడికోసం ఏకాగ్రతతో నిరీక్షిస్తూ వుంటామో, ఆ నిరీక్షణలో ఎంతో మకరందాన్ని పొందగలుగుతాము. నిరీక్షణలోనే ఫలితం వుంది. 'నేను పొందాను' అనుకున్నవాడికి ఏమీలేదు. అన్నీ పొందేశాననుకుంటే యిక తరువాత మెట్టేమిటుంటుంది? ఏ భగవత్తత్వాన్ని మనం విని, మాట్లాడుకుని, ఆనందాన్ని అనుభవిస్తున్నామో దానికి ఫుల్‌స్టాపు (full stop) లేదు. అది ఎంతపొందినా, యింకా అనంతంగా వుంది. ఎందుకంటే, జీవితపర్యంతం దాని ఆస్వాదన జరుగుతూ వుండాల్సిందే. అది ఎంత పొందినా యింకా యింకా జుర్రుకోడానికి మాధుర్యం ఊరుతూనే వుంటుంది. అక్కడికి వెళ్లి మనని మనం మర్చిపోయి, అందులో లయించిపోవడమే తప్ప వేరే ఏదీలేదు. ఉప్పు బొమ్మని సముద్రం లోతు చూసిరమ్మని పంపించారట! అది తిరిగి వస్తుందా? సముద్రం నుండి పుట్టిన ఉప్పు బొమ్మని సముద్రం లోతు చూడమని పంపిస్తే మళ్లీ తిరిగిరాదు. అదేవిధంగా పరమాత్మ నుండి వుద్భవించిన మనం, ఆయనని తెలుసుకుందామని వెళితే ఆయనలోనే లయించిపోతాము.

ఇదంతా కూడా భగవంతుని యొక్క సృష్టి. ఎవరి అనుగ్రహం వలన మనం మన పనులన్నీ చేయగలుగుతున్నాం? మనకి దేని గురించి నిరీక్షిస్తే ఆనందం కలుగుతోంది? అదే పరమాత్మ యొక్క దివ్య అనుగ్రహం. చేరవలసిన గమ్యస్థానం గురించి చేయవలసిన ప్రయత్నం చేస్తేనే ఆనందం కలుగుతుంది. ప్రపంచంలోని తదితరమైన వస్తువులని ఎంత వరకూ పొందాలో

అంతరవకూ పొంది, అందులో వున్న సత్యత్వాన్ని గుర్తించాలి. ప్రపంచ విషయాల వలన చివరికి దు:ఖమే మిగులుతుంది.

గారెల ఆనందం ఎంతవరకూ? మబ్బు, ఉరుములు, వర్షం వచ్చేంతవరకేగా? అంటే తెరలు తెరలుగా కడుపునొప్పి, అపానవాయువు, విరోచనాలు! అపానవాయువు గురించి చెప్పేసరికి మీరందరూ నవ్వుతున్నారు ఎందుకని? 'పనికిరాని వస్తువు అని మీరనుకుంటున్న దానిలో కూడా నేనున్నానని' ఆ భగవంతుడు అక్కడే కూర్చుంటున్నాడు. అందుకనే దేవుడికి నైవేద్యం పెట్టేటప్పుడు 'ఓం అపానాయస్వాహా' అని చెప్తున్నాం.

సముద్రం దగ్గరకు వెళ్లి పైపైనే చూస్తే, ఇసుక, నురుగు, నత్తగుల్లలే దొరుకుతాయి. లోతుకి వెళ్తే రత్నాలు దొరుకుతాయి. అంతేకాదు సముద్రస్నానం చేసేటప్పుడు మనం నేర్చుకోవలసిన కొన్ని మెలకువలున్నాయి. కెరటం దగ్గరకి మనం ధైర్యంగా వెళ్లాలి. అప్పుడు దాని తాకిడికి మనం తట్టుకొని నిలబడగలుగుతాం. పెద్ద అల మనమీదకి వచ్చినప్పుడు మనం శిరస్సు వంచితే అది మన పైనుంచి వెళ్లి పోతుంది. లేదంటే మనం దానికంటే దాటడానికి మెలకువలు తెలియక నత్త గుల్లలు ఏరుకుని సంచులలోకొద్దిగా పైకి ఎగిరితే, ఆ కెరటం మనకాళ్ల క్రింద నుండి వెళ్లిపోతుంది.

అదేవిధంగా, సంసారమనే సముద్రంలో భగవంతుని విశ్వసించి, ఆయన యందు పరిపూర్ణమైన ప్రేమని పెంపొందించుకొని, 'దాసోహం' అని ఉండాలి. 'అందరలో వున్న భగవంతుడికి నేను దాస్యం చేస్తున్నాను; ఈ విధంగా నా మనసు వుండగలిగితే చాలు' అనే భావన కలిగి వుండటం, పెద్ద కెరటం వచ్చినప్పుడు తల వంచినట్టు. 'దాసోహం'లో వుంటే 'సోహం - దదాతి' అంటే ఆ పరమాత్మే నేను అనే జ్ఞానాన్ని కలిగిస్తుంది.

-సశేషం

> పాపాత్ముడి మనస్సు ఉంగారల జుట్టు వంటిది. ఎంత ప్రయత్నించినా ఉంగరాల జుట్టును నువ్వు సాఫీగా చేయలేవు. అలాగే దుర్జనుడి వక్రబుద్ధిని సరిచెయ్యటం దుర్లభం.
>
> - శ్రీరామకృష్ణులు

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

బియ్యంలో రాళ్ళు ఉంటే ఎలా హాని కలుగుతుందో అలాగే స్వచ్ఛంగా ఉండవలసిన మనస్సు విషయవాంఛలతో కూడి ఉంటే మీకు ధ్యాన సమయంలో ఎంతో బాధిస్తాయి. అట్టి స్థితిలో ఉన్న మానవుడికి మహాత్ముల విలువ ఏం తెలుస్తుంది! ఆయన ప్రసాదించిన లక్ష్యార్థం యొక్క విలువను ఎలా గ్రహించగలుగుతాడు? ధ్యానం అంటే జపమాల త్రిప్పటం కాదు. జపమాల నిలచిపోవాలి. పెదవుల కదలిక ఆగిపోవాలి. మనస్సు నిలచిపోవాలి.

మనస్సు నిలిచినట్లు ఎలా తెలిసికోవటం? ధ్యానంలో నిదుర పోవటం మనస్సు నిలచినట్లు కాదు. ధ్యాన సమయంలో ఒక రేడియో, ఒక గడియారం ప్రక్కన ఉంచుకోవాలి. రేడియో శబ్దం తక్కువగా ఉండేటట్లు అమర్చుకోవాలి. మనస్సు నిలిస్తే రేడియో, గడియారం శబ్దాలు వినబడవు. క్రమ క్రమంగా సముద్రపు హోరుని కూడా జయించ గలుగుతావు. వీటన్నిటినీ జయించిన తరువాత మనస్సులోని సంకల్పాలన్నీ కూడా జయించ గలుగుతావు. అదే భావ సమాధి.

బియ్యంలో రాళ్లు ఏరటానికి బద్ధకిస్తే ఏమవుతుంది? అలాగే మనస్సులో అనేక సంకల్పాలు పెట్టుకొని ధ్యానానికి కూర్చుంటే నీ బాల్యంలోనివి, గత జన్మలోనివి రీల్సు తిరుగుతాయి. నీటిలో చెంబుని ముంచగానే బుడబుడమని శబ్దం వస్తుంది కదా! అలాగే ఉంటుంది నీ ధ్యానం. పోనీ సంకల్పాలను జయించావనుకో కామక్రోధాది గుణాలు రెచ్చగొడతాయి. వాటిని కూడా జయించావనుకో అప్పుడు మాయాశక్తి నీకు దేహబద్ధకాన్ని కాని, దేహబాధను కాని తీసికొని వస్తుంది. దానిని అవకాశంగా తీసుకుని ధ్యానాన్ని వాయిదా వేస్తావు. మహాత్ములకు దాసోహం అనినమస్కరించటానికి చేతులు రావు. అదే ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ రైడ్‌కి వస్తే అయ్యా! అయ్యా! అంటూ వంగి వంగి నమస్కరిస్తూ కాళ్ళు పట్టుకుంటాడు. దానధర్మాలు చేయటానికి చేతులు రానివాడు, ఆఫీసర్‌కి ఎంత ఇమ్మన్నా ఇస్తాడు. దానం చేసేవాడు తన పాత్రకు తగిన దానం చేయాలి.

ఒక ఊళ్ళో పెద్ద రైతు ఉండేవాడు. అతడు నిత్యమూ తన తోటలో పండిన తోటకూర దానం చేసేవాడు. దాని ఫలితంగా అతడు మహారాజుగా జన్మించాడు. తోటకూర దానం ఫలితంగా ఉత్తమ జన్మ వచ్చింది కాబట్టి

ఈ తోటకూర ఇంకా ఎక్కువగా దానం చేస్తే ఇంకా మంచి ఫలితాన్ని పొందవచ్చు కదా! అనుకొని కొన్ని వందల ఎకరాలలో తోటకూర పండించి దానం చేయటం మొదలు పెట్టాడు. దీనిని గమనించిన ఆ రాజగురువు ఆ మహారాజుని హెచ్చరిస్తాడు. 'రాజా! నువ్వు దానం చేస్తున్నావు చాలా సంతోషం. కాని అది నీ స్థితికి తగినట్లుగా ఉండాలి. మహారాజువై యుండి తోటకూర దానం చేయటం తగనిపని' అంటాడు. ఆ మహారాజు గురుదేవుడు చెప్పిన దానిలో సత్యం ఉందని గ్రహించాడు. అది ఆయన పూర్వజన్మ సుకృతము. గురుదేవుడు హెచ్చరిక చేసినా గ్రహించని వారిని ఎవరు బాగుచేయ గలుగుతారు? ధ్యానం చేసేటప్పుడు నీ ఇంద్రియాలకి లొంగకుండా ధీరుడవై కూర్చోవాలి. అప్పుడు ఓం అనే ప్రణవం ఉచ్చరించేసరికి ఇంద్రియాలు, మనస్సు స్థంభించిపోవాలి. అదే సమాధి స్థితి. అట్టి స్థితిని పొందింపచేసే వారే మహాత్ములు అన్నారు శ్రీబాబు.

22-5-1985

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ నేను తెలుసుకున్నాను అంటే కరెక్టేనా డాక్టర్? అని ప్రశ్నించారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ అది కూడా తప్పే తెలుసుకునేవాడు ఇంకొకడు ఉన్నాడనే కదా! అంటే అత్యంత పరిపూర్ణ వస్తువులో ద్రష్ట, దర్శన, దృశ్యాది భేదభావం ఉండకూడదు కదా! ఇంద్రియ దృష్టి ఉన్నంత కాలం భేదభావం పోదు అన్నారు బాబు. మీకు ఒక దృష్టాంతం చెబుతాను. పంచదార, నీళ్ళ గ్లాసు ఉన్నాయి. రెండూ వేరుగానే ఉన్నాయి. భగవంతుడు ఉన్నాడని నువ్వు విశ్వసిస్తూ అదే భావంలో నేను వేరు భగవంతుడు వేరు అని ఎంతకాలమైనా నువ్వు అలాగే ఉండిపోతావు. పంచదారను నీటిలో కలిపితే మధురంగా ఉంటుంది. నీరు మధురంగా ఉంది అనే భావనలో కూడా పర్ణత్వానికి లోటు ఉన్నట్లే పరిగణించ బడుతుంది. ఆ నీటిని అగ్నికి దగ్ధం చేస్తే నీరు హరించుకుపోయి పంచదార మాత్రమే మిగులుతుంది. అలాగే ధ్యానాగ్నికి నీచగుణాలు దగ్ధం అయినప్పుడు అక్కడ మిగిలేది **అహం** అనే ఆత్మభావనే, ఆ స్థితిలో సంకల్పాలకు తావులేదు. ఇంక ద్రష్ట, దర్శన, దృశ్యం అనే భేదభావం ఎక్కడ ఉంటుంది?

అటువంటి ఆత్మవిద్యను అభ్యసించాలంటే సత్యగురువు లభించాలి. పట్టుదలతో సాధించాలి. ఒక వ్యక్తి హార్ట్ స్పెషలిస్ట్ కావాలంటే ఏ రకమైన కృషి లేకుండా దానిని సాధించగలడా? మన డా॥ కృష్ణార్జునరావు గారు డెంటల్ సర్జన్ కదా! ఆయన ఎంత కృషి చేస్తే ఈ స్థితికి వచ్చాడు? పాపం! విదేశయాత్ర

కూడా చేశాడు. ఏ రకమైన కృషి చేయకుండా ఆత్మ జ్ఞానం కావాలంటే ఎలా వస్తుంది? అది ధనాన్ని వెచ్చించి బజారులో కొనుక్కునే వస్తువా! ఎప్పటికైనా ఆత్మజ్ఞానం పొందవలసిందే. అది పొందేవరకు జన్మలు తప్పవు. నీవు ఎవరవో తెలిసుకొనుటయే ఆత్మజ్ఞానము. ప్రకృతిలో సకల జీవరాసులకి ఆధారమైనది ఆత్మవస్తువే. అదే మధురత్వాన్ని, సౌందర్యాన్ని, సుగుణాల్ని ప్రసాదిస్తుంది. కాని దానికి మాత్రం గుణాలు లేవు. నీటికి మధురత్వాన్ని ప్రసాదించేది పంచదారే కదా!

నీ మనస్సుని చంచల భక్తితో ధ్యానిస్తే, నీ మనస్సు భగవంతునిలో లయమై భగవంతుడే నీ భావనలో మిగిలియుంటాడు. నీలో దర్శించిన పరమాత్మను అంతటా దర్శించగలుగుతావు. **అహం బ్రహ్మాస్మి** నేనే బ్రహ్మను, **అయమాత్మ బ్రహ్మ** అంతటా వ్యాప్తమైయున్న బ్రహ్మను నేను అని తెలుసుకో గలుగుతావు. అదే అద్వైత సిద్ధి. అదే మోక్షము. దానిని ఈ జన్మలోనే అనుభవపూర్వకంగా పొందగలగాలి. ఎంత సంపాదించినా, ఏ పదవిని అలంకరించినా ఆ ధనమూ ఉండదు, ఆ వ్యక్తీ ఉండడు. మరి ఏం లాభం? భగవంతుని ఎవరైతే విశ్వసిస్తారో వారే సుఖపడతారు. వారికి దుఃఖం ఉండదు. సద్గురుమూర్తి ఎన్నో అనుభవాలను అందిస్తారు కాని దానిని అందుకొనే పాత్ర సరియైనదై ఉండాలి. వివేకానందుడి పాత్ర అటువంటిది కాబట్టి రామకృష్ణ పరమహంస అందించినదాన్ని అందుకోగలిగాడు అన్నారు శ్రీబాబు.

డాక్టరుగారు ప్రశ్నిస్తూ అంతా ముందే నిర్ణయింపబడి ఉంటుందా? అని అడిగారు. శ్రీబాబు మాట్లాడుతూ అవును అంతా విధి నిర్ణయము ప్రకారమే జరుగుతుంది. దానిని ఎవరూ తప్పించలేరు అన్నారు. ఆ భక్తుడు తిరిగి ప్రశ్నిస్తూ అంతా విధి నిర్ణయం ప్రకారమే జరిగేటప్పుడు మనం చేయవలసిన కృషి లేక సాధన ఏముంటుంది? అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ విధి నిర్ణయం నిష్పక్షపాతంతో కూడినది. అది నువ్వు ఆచరించే కర్మను అనుసరించి ఉంటుంది. నువ్వు చేసిన కర్మఫలాన్ని అనుభవించాల్సిందే కదా! బురద గుంటని ఆశ్రయించి దుర్గంధం ఎందుకు వస్తోంది? దానిని పరమాత్ముడు నిరోధించలేడా అంటే ఎలా ఉంటుంది? సుగంధంతో కూడిన ఆత్మవస్తువుని ఆశ్రయించు ఆనందాన్ని పొందు. మానవుల ప్రేమ ఈర్ష్య అసూయ రాగద్వేషాలతో కూడి ఉంటాయి గాని పరమాత్ముని ప్రేమ కళంక రహితమైనది. నువ్వు ఆయన్ని ప్రేమించక పోయినా ఆయన నిన్ను ప్రేమిస్తాడు అన్నారు శ్రీబాబు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఫిబ్రవరి 2011**

**1 మంగ** మాసశివరాత్రి

**10 గురు** రథసప్తమి

**14 సోమ** భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ. సత్సంగం, పెద నింద్రకొలను బ్రాంచిలో శ్రీ గురుదేవుల దివ్య మంగళమూర్తి ప్రతిష్టా సప్తమ వార్షికోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**18 శుక్ర** మాఘపూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**27 ఆది** శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

**మార్చి 2011**

**2 బుధ** మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకము, 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 7గం.లకు, శ్రీ కాళికాపరమేశ్వరీ శ్రీరామలింగేశ్వరుల లీలా కళ్యాణము, రాత్రి 9.గం.లకు గం.లకు శ్రీ కాళికాపరమేశ్వరీ శ్రీరామలింగేశ్వరుల నగరోత్సవము

**7 సోమ** శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి పుణ్యారాధన మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం,

**19 శని** పూర్ణిమ, హోలీ పండుగ,శ్రీ సద్గురుపాదపూజ

**28 సోమ** శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

# ఉపాసన అంటే ఏమిటి?

-వెంకట రమణ ప్రసాద్

మనం నిర్ణయించుకొన్న ఒక లక్ష్యానికి సమీపంగా కూర్చోవటమే ఉపాసన అనే పదానికి అర్థం. (ఉప - సమీపము, ఆసనే - కూర్చొనుట) ఉపనిషత్తులలో సగుణ బ్రహ్మోపాసనలు 'విద్య' లనబడినవి. అట్టి విద్యలు 32 చెప్పబడినవి.

కర్మల వలెనే సగుణ బ్రహ్మోపాసనలు అనేక విధములుగ చెప్పబడినవి. కాని, ఈ ఉపాసకులకు కలుగు ఫలితములు గూడ వేరుగ వేరుగ తెలియజేయ బడినవి. ధనధాన్యాదులను పొందుటకు కొన్ని, పాపమును నశింపజేసికొనుటకు కొన్ని, క్రమ ముక్తి సాధించుటకు కొన్ని ఈ విధముగ వివిధ ముక్తిఫలము గాగల ఉపాసనలనే చేయవలెనని సూచింపబడినది. నిర్గుణోపాసన కష్టమేగాక, దాని నవలంబించుటకు తగిన యధికారము, పరిపక్వత కలిగి యుండవలెను. అట్టి అధికారమును లేనివారికి గూడ నగు' బ్రహ్మోపాసనమే తగిన సాధనామార్గముగ తెలియజేయబడినది.

బ్రహ్మ విచారము చేయుటకు తగిన సామర్థ్యము లేనివారు, సచ్ఛాస్త్రములను స్వయముగ చదివి అర్థమును గ్రహింపలేనివారు, సద్గురువు లభింపని వారేనను మోక్షకాయులును అయినవారు నిర్గుణోపాసన చేయవలెనని 'వేదాంత పంచదశి'లో శ్రీవిద్యారణ్యులు చెప్పిరి. (పంచదశి 6-54).

ఈ జన్మమున నిర్గుణోపాసకునికి బ్రహ్మసాక్షాత్కారము కలుగనిచో, మరణసమయమున గాని, జన్మాంతరమునగాని, బ్రహ్మలోకమునగాని సాక్షాత్కారము సిద్ధించును. ఈ జన్మమందే నిర్గుణోపాసన పరిపక్వమైనచోఅదియే సవికల్ప సమాధిగ పరిణమించి, తరువాతి జన్మలో నిర్వికల్పసమాధి సిద్ధించునని విద్యారణ్యులు యభిప్రాయము.

బోధ, లేక జ్ఞానము వస్తు తంత్రము. ఉపాసన పురుష తంత్రము. మన జీవితంలో దేనిని పొందాలన్నా సాధన చేయాలి. మోక్షము మనము సాధించవలసిన పురుషార్థము. సాధన అనగా సాధించుటకు అనుసరించు మార్గము. అనగా అది యొక కర్మ లేక క్రియ అయితీర వలెను. అందువలన అది వస్తు తంత్రమేగాని, పురుష తంత్రము కాదనియు శ్రీశంకర భగవత్పాదుల భావన.

తంత్రమనగా ఒకదాని కధీనమై యుండుట లేక ఒక దానిపై ఆధారపడి యుండుట. ఆయా వస్తువుల స్వభావం మీద ఆధారపడినట్లైతే అది వస్తుతంత్రం. అలా కాక ఒక పురుషుడి ఆలోచన మీద, లేక వాని బుద్ధిమీద ఆధారపడినట్లైతేఅది పురుషతంత్రం, లేదా బుద్ధి తంత్రం.

సాలగ్రామాన్ని చూచి, 'ఇది శిల' అని గ్రహించటం వస్తుతంత్రం. కాని దానిని చూచి 'ఇది శ్రీమహావిష్ణువు' అని గ్రహించటం పురుషతంత్రం.

**బోధోపాస్త్యోర్విశేషః క ఇతిచేదుచ్యతే శృణు వస్తు తంత్రో భవేద్బోధః కర్తృ తంత్రముపాసనన్.** (పంచదశి -9-74)

అనేక మారులు ఒకే విధముగ తాననుకొన్న విధమున భావన చేయుటయే ఉపాసన. గురూపదేశమును నమ్మి భావించెడి వస్తువును తప్ప మరియొక దానిని జ్ఞాపకము రానట్లెడతెగక ప్రవర్తించెడు వృత్తుల ప్రవాహమే ఉపాసన. ఈ విధముగ నిరంతరము చేసిన ధ్యానమునకు ఫలితముగ, కలలో కూడ ఆ ధ్యానము కొనసాగుచుండును. 'ఉపాసింపబడెడి దైవము తానే యని నిశ్చయము కలుగునంత వరకు ఉపాసన చేసి అట్టి నిశ్చయము మరణ పర్యంతము కలిగియుండవలెను. అట్టి ఉపాసనా విధానమునకే అహంగ్రహోపాసన అని పేరు. ఉపాసన పురుష తంత్రము గనుక దానిని చేయుటకు, చేయకుండుటకు, విపరీతముగ చేయుటకు అవకాశమున్నది.

**పురుష స్వేచ్ఛయా కర్తుమకర్తుం, కర్తుమున్యథా**
**శక్తోపాస్తిరతో నిత్యం కుర్యాత్ప్రత్యయ సంతతిమ్**
(పంచదశి -9-80)

కనుక అనునిత్యము ప్రయత్నపూర్వకముగ 'సజాతీయ విజాతీయ ప్రత్యయ ప్రవాహమును నిలుపుకొనవలెను'. జ్ఞానము ఏకము, అద్వయము. రెండవ పదార్థమే లేని జ్ఞాన విషయములో కర్మకు అవకాశమే లేదు. కనుక అద్వైతాన్ని అందుకోవటానికి సాధన కూడ అద్వైతమే అయి ఉండాలని శంకరుల వాదన. -సశేషం

అహంకారం నిలిచి ఉండేంతవరకు ఆత్మజ్ఞానం కాని, ముక్తికాని లభించదు. జనన మరణ బంధం తొలగదు.

# సాధనాపోదేశ చతుష్టయము

- సుషుమ్నా ప్రసాద

మోక్షఫలమునుగోరు జిజ్ఞాసువులకు, గురుపుత్రులకు సాధననేది అత్యంత ఆవశ్యకము. 'సాధనతో చేకూరు సమస్త కార్యముల్' అను నానుడి యుండనే యున్నది. పట్టుదలతో కార్యాచరణ చేయటమే సాధన. వ్యావహారిక జగత్తులోనే సాధన లేనిదే విజయలక్ష్మి వరించదు. ఇక ఆధ్యాత్మిక రంగములో నిత్యానంద సుధను గ్రోలటానికి సాధనే ఏకైక మార్గము.

మనకు భగవంతుడు రెండు అపూర్వ వరములను ప్రసాదించాడు. అనంతకోటి జీవరాసులలో ఉత్తమోత్తమైనది మానవ జన్మ లభించటమనేది ఒక అపూర్వవరము. పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకు లేని వివేచనా శక్తి మానవుడికి ఒక్కడికే ప్రసాదించాడు భగవంతుడు. దానికి తోడు మనలను సత్యధర్మాలలో నడిపించే సద్గురువు దొరకటం మరొక మహత్తర వరము. అంటే Aditional Bonus అన్నమాట.

గురువులు లభించవచ్చుగాని, సద్గురువులు లభించటమనేది దుర్లభము. అట్టి సద్గురుదేవుని కోసం శిష్యుడెంతో శ్రమించి, అన్వేషిస్తే గాని లభించడు. కాని మనకు పురాకృత పుణ్య విశేషముచేత ఎలాంటి శ్రమ లేకుండ సద్గురుమూర్తి లభించారు. కొందరికి జననీ జనకుల ద్వారా, మరి కొందరికి వ్యాధిమిషతో లేక స్నేహితుల ద్వారానో, మరేనిమిత్తముతోనో సద్గురు దర్శన భాగ్యము లభించింది.

ఆత్మజిజ్ఞాసువులకు మోక్షము సాధించటానికి సాధన చతుష్టయ సంపత్తి కావాలని శాస్త్రములు, మహాత్ములు చెప్పారు. నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్ర ఫలభోగ విరాగము, శమాదిషట్కసంపత్తి, ముముక్షత్వము ఈ నాల్గింటిని సాధన చతుష్టయ సంపత్తిగా పేర్కొన్నారు. సద్గురుమూర్తి ఎంతటి ప్రేమానుగ్రహ సంపన్నులంటే సంసారమనే మలకూపంలో మునిగి దుర్వాసనతో ఉన్న ఆపన్నులను ప్రేమతో అక్కున చేర్చుకొని దివ్యానుగ్రహమనే అమృతవర్షంతో సంపూర్తిగా క్షాళనముచేసి, పవిత్రులుగా రూపొందిస్తున్నారు.

అలా సద్గురుమూర్తి అనుగ్రహవీక్షణముతో, పవిత్రతను సంచరించుకోవటానికి ఆత్మాన్వేషి సాధనోపదేశ చతుష్టయ సంపత్తిని పెంపొందించుకోవాలి. ఈ నాలుగు సాధనోపదేశ మార్గములను ఇంగ్లీషులో

letter 'f ' తో చెప్పుకోవచ్చు. అంటే సద్గురుమూర్తి ఆదేశాన్ని చక్కగా అనుసరించి, ఆచరించాలి. తద్వారా మాయ అనే భూతము ధీశాలియై ఎదుర్కొనిరి. చివరిదాకా పోరాటము కొనసాగించి జగత్రీడను ముగించాలి.

follow the masters' instruction
face the Devilish Illusion
fight to the end
finish the game.

సద్గురుదేవుని ఆశ్రయించినవాడు మాత్రమే మాయ అనే పెనుభూతమును ధీశాలియై ఎదుర్కొని చివరిదాకా పోరాటము కొనసాగించి జగత్రీడను ముగించాలి. సద్గురుదేవుని ఆశ్రయించినవాడు మాత్రమే మాయ అనే పెనుభూతమును ఎదుర్కొనగలడు. మహనీయుల ఆశ్రయము, ఆదేశము లేకుండ ఎవరికివారే ఆత్మానుభూతిని పొందాలి అంటే సాధ్యమయ్యే విషయము కాదు. గురుపుత్రులకు సంశయాత్మక బుద్ధి నశించి, సందేహ నివృత్తి కావాలి. గురు మహిమను, శక్తిని సందేహించినవాడు ఎన్నటికీ తరించలేడు. అందుచేత ఆధ్యాత్మిక సాధనకు ముందు గురుమూర్తి పట్ల అకుంఠిత విశ్వాసము, శ్రద్ధా ఉండాలి. గురుమూర్తి మాత్రమే తనను సంసారమనే ఊబి నుంచి పైకి తీసి, ఆత్మానందమును ప్రసాదించగల సమర్థుడని సంపూర్ణముగా విశ్వసించాలి. అప్పుడే సాధకుడు గురుమూర్తిననుసరించి గురువాజ్ఞాపాలన చేయగలడు.

అనుసరణ అంటే బాహ్యమైన అలంకరణ,. వస్త్రధారణ కాదు. సత్య గురుదేవుడు ఎప్పుడూ అనుష్ఠానానికే ప్రాధాన్యత ఇచ్చాడు. గురుముఖతః వెలువడిన బోధామృతమును బాగుగా శ్రవణము చేసి ఆకళించుకొని ఆచరణలో పెట్టాలి. గురుమూర్తి అనుష్ఠాన మార్గమునందే పయనించాలి. సద్గురుమూర్తి మనకు అణువణువున మార్గదర్శియని గ్రహించి, ప్రగాఢముగ విశ్వసించి, స్వామి ఆదేశానుసారం ప్రవర్తించాలి. ఈ విషయాన్ని ఆంగ్లకవి ఈ విధంగా చెప్పాడు Lives of great men remind us To make our lives sublime అంటే మహాత్ముల జీవితాలు, మన జీవితాలు కూడా వారి జీవితాల వలె ఉదాత్తముగ చేసుకోమని స్ఫూర్తినిస్తాయి. అందుచేతనేగురుమూర్తి ఆజ్ఞానువర్తియై గురుమూర్తి అనుష్ఠాన మార్గమును అనుసరించినవాడు తప్పక తరిస్తాడు. గురుదేవుడు ఎప్పుడూ అనుభవానికే ప్రాధాన్యతనిచ్చాడు. అందుచేతనే అస్మద్గురుదేవులు ' మీరు శరీరానికి వచ్చిన

జ్వరాన్ని ఎలా అనుభవిస్తారో, అలాగే ఆత్మానుభూతిని పొందాలి అని ప్రబోధిస్తారు. వాచావేదాంతము నిష్ఫలమని వారు తృణీకరిస్తారు.

రెండవ ఉపదేశ సూత్రము fece the Devolish Illusion boldly అంటే పెనుభూతము లాంటి మాయను ధైర్యముతో ఎదుర్కోవాలి. పిరికిపందలాగ పారిపోకూడదు. భయపడిన కొద్దీ అది భయపెడుతుంది. వాస్తవంగా చూస్తే మాయకు స్వతసిద్ధమైన ఉనికి లేదు. మాయ అన్నా, అవిద్య అన్నా, అజ్ఞానమన్నా ఒక్కటే. మాయ కేవలము నీడ లాంటిది. మన నీడను చూసి మనమే భయపడుతున్నాము. ఇతరులను పిచ్చివాళ్ళని హేళన చేస్తాము. కాని విషయలోలుడై, మాయకు వశుడైన మానవుని కంటె పిచ్చివాడు ఎవరుంటాడు? ఎన్నో జన్మల నుంచి మాయతో సహవాసము చేశాము కాబట్టి ఆ మాయను జయించాలంటే తీవ్రంగా పోరాడాలి. మాయా ప్రభావముచేత కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గము మన హృదయంలో తిష్టవేసుకుని కూర్చున్నవి. బాహ్య శత్రువులను జయించటము, అంతఃశత్రువులను జయించటం కంటే సులభమే. గురుకృప అనే కవచాన్ని ధరించి, గురునామ ధ్యానమనే ఆయుధాలను ధరించి శత్రువుతో ధీరుడై పోరాడాలి. లేకుంటే మాయ అనే పెనుభూతముదే పై చేయిగా ఉంటుంది.

మనకు సహకరిస్తున్నాయి అనుకుంటున్న మనస్సు, ఇంద్రియాలు తిరుగుబాటు చేస్తున్నవి. ఎన్నో జన్మల నుండి వాసనా ప్రలోభముతో విషయసుఖాలపైకి అవి పరుగిడుతున్నాయి. విషయోన్ముఖమైన మనస్సును, ఇంద్రియాలను భగవోన్ముఖం చేయాలి. గురుదేవుడెప్పుడూ మనస్సు main switch వంటిదని, ఆ main switch ని అదుపులో పెట్టుకొంటే, ఇంద్రియాలు automatic గా భగవోన్ముఖం అవుతాయని సెలవిచ్చారు.

జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను భగవత్సేవకు వినియోగించాలంటే భగవత్ప్రసాదితమైన నేత్రాలతో సద్గురుదేవుడినే సందర్శిస్తూ, శోత్రేందియముతో గురుబోధామృతమునే ఆలకిస్తూ, ఘ్రాణేంద్రియముతో గురుదేవుని సుగుణ పరిమళమునే ఆఘ్రాణిస్తూ, గురు ప్రసాదమునే చవిచూస్తూ, సద్గురుదేవుని స్పర్శతో బాహ్య విషయములను పూర్తిగా విస్మరించాలి. అలాగే కరచరణాది కర్మేంద్రియములను, గురుసేవకే వినియోగించు, అప్పుడు మాయ తోక ముడుచుకొని పలాయనము చిత్తగిస్తుంది.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గత సంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

"ఇంకేముంది? సమయానికి నేనక్కడ ఉన్నాను గనుక సరిపోయింది." అంటున్న కొడుకుమాటలకి "ఔను ఆపదల్లో ఆదుకునే వాడివీ, అందర్నీ చల్లగా చూసేవాడివీ అని అందరూ అనుకునే ఆరిందా గోవిందుడివికదా నువ్వు"అంది తల్లి. "చూడలే! ఆనాడు నేను కాళింది మడుగులో దూకినప్పుడు మీరంతా ఎలా ఏడ్చారు! ఎంత బాధ పడ్డారు! మరి ఆ అమ్మాయి తల్లిదండ్రులు అప్పుడక్కడ ఉంటే ఎంత గోల పెట్టేవారో కదా! అందుకని నేను వెంటనే నీళ్ళలోకి దూకి తనని గట్టుకి చేర్చాను". యశోదమ్మ కళ్ళలో కృష్ణుడు (మడుగు)లో దూకిన దృశ్యం కదిలింది. గుండె ఝల్లుమంది. "అమ్మో! ఎంత గండం తప్పిందో" అని పైకే అంది. "ఔనమ్మా పెద్ద గండం తప్పిందా పిల్లకి. నువ్వంటుంటావే భూమ్మీద ఇంకా నూకలున్నాయని. కనుకనే బ్రతికింది. పాపం తను మాటలురాని మూగపిల్ల. ఆమాయకురాలు. పైన పేదవాళ్ళు వాళ్ళు. పోనీ...." అమ్మకళ్ళవంక చూస్తూ ఆగాడు కన్నయ్య. 'చెప్పరా' అంది యశోదమ్మ.

"మీ అమ్మాయి నీళ్ళలో మునిగిపోయినపుడు బైటకి తీసింది ఎవరోకాదు. మా నందమహారాజుకారబ్బాయి గోపాలకృష్ణయ్య. విన్నారా! ఇప్పుడాయనగారేమో వాళ్లమ్మతో జరిగిందంతా చెప్పాడు. యశోదమ్మగారు పెద్ద మనస్సుతో జాలిపడి నీలిని తనకి చేతిసాయంగా తమ యింట ఉంచుకుంటానని మీకు చెప్పి అమ్మాయిని తీసుకురమ్మన్నారు మీ కిష్టమైతే..." యశోదమ్మ పంపిన గోపాలకులు వచ్చి చెప్తుంటే వింటూ నీలి ముందుకి నడిచింది. వెనకాలే ఆమె తండ్రి బయలుదేరాడు. తిరిగి వచ్చాక భార్యతో అన్నాడు "అంతటి భాగ్యవంతుల ఇంట చేరిన మనపిల్ల ఎంతో అదృష్టవంతురాలు. మనం ఇంక దాని గురించి దిగులు పెట్టుకోనవసరం లేదు." అని.

నందునింట అడుగుపెట్టినప్పట్నించీ నీలి యశోదమ్మ వెంటవెంటనే ఉంటూ, చేతిలో పని అందుకుంటూ, ఆవిడ చేత పనిమంతురాలు, బుద్ధిమంతురాలని అనిపించుకుంది. నల్లనయ్యకోసం యశోదమ్మ ఏపని పురమాయించినా ఉరకలేసే మనస్సుతో సిద్ధంగా ఉంటుంది నీలి. తక్షణం

నెరవేరుస్తుంది. బాలకృష్ణుని ఒంటినిండా నగలుపెట్టి, ఎర్రని తామరపూలంటి పాదాలకి పారాణిదిద్ది పసిడిమొగ్గల గజ్జెలు కాళ్ళకి అలంకరించగానే కొంటె గోపాలుడు ఒకగంతువేసి పకపక నవ్వుతాడు.

మొలనూలునున్న చిరుగంటలు మ్రోగుతూ బాలుని నవ్వులో జతగలుపుతాయి. ఆక్షణాలు నీలికి చాలా యిష్టమైనవి. చేతిలో మురళి ఊదుకుంటూ తోడిపిల్లలతో గోవుల్ని తోలుకుంటూ అడవులకి వెళ్ళిపోయిన కన్నయ్య సందెవేళకి తిరికొచ్చిందాకా నీలికి పొద్దు గడవదు. వాని రూపమూ, వేణుగానమూ ఆమె కళ్ళల్లో, చెవుల్లో అమృతం పోస్తుంటాయి.

కృష్ణుడు చేసిన అల్లరులు, అద్భుతాలు అన్నీ ఎవరెవరో వస్తుంటారు నందయశోదలకి చెప్తుంటారు. వాళ్ళు చెప్పినవన్నీ వింటూ అమ్మ వడిలో అమాయకునిలా వదిగిపోయి ఓరచూపులు చూస్తుంటారు బాలగోపాలుడు. నీలికి ఆశ్చర్యంగా అనిపిస్తుంది అసలు ఎవరీ బాలుడు? బాల రూపుడై తిరుగుతున్నవాని గురించి ఎవరు చెప్పగలరు?

లేగదూడని కట్టేసి ఆవుముందు కూచుని పాలు తీస్తోంది నీలి. కృష్ణుడు గోవుల్ని తోలుకుని అడవులకి పోయే వేళయింది. పాలధారవంక చూస్తున్న నీలికి ఉన్నట్టుండి ఆవు పొదుగులో నల్లనయ్య రూపం కనబడి ఉలిక్కిపడింది. తలెత్తి ఆవువంక చూసింది. అక్కడా కృష్ణుడే. తలతిప్పి దూడవంక చూసింది. అది కూడా కృష్ణుడిలాగే ఉంది.

అయోమయంగా ఉండి పాలచెంబు అక్కడే వదిలేసి ఇంట్లోకి వెళ్ళింది. యశోదమ్మ కట్టి ఇచ్చిన పెరుగన్నం చిక్కం బుజానికి తగిలించుకుని చేతిలో కొంకికఱ్ఱ పట్టుకుని మొలలో వేణువు దోపుకుంటున్న కన్నయ్య "నీలి ఏమిటిలా వచ్చావు?" అన్నాడు.

మాటరాని నీలి ఏమీ చెప్పలేక పోయింది. "పాలుతీస్తే ఆగోవుని కూడా తోలుకుపోతాను మరి" అన్నారు మళ్ళీ. నీలి చేతిలో పాలచెంబు లేకపోవటాన్ని చూస్తూ యశోదమ్మ "వెళ్ళి ముందా పని చూడు" అంది. నీలి వెనకే కృష్ణుడు వెడుతూ" నువ్వు చూసిందంతా చెప్పలేవుగాని. అదంతా నిజమే." అన్నాడు గంభీరంగా. అప్పట్నించీ నీలికి ఆలోచనలు ఎక్కువైనాయి. అది తన ఊహా? నిజంగా చూసిందా? కృష్ణుడు నిజమేనని చెప్పాడు గదా! నమ్మాలా?

-సశేషం

# బెంగుళూరులో శ్రీ మాతాజీ

-పరాశర ప్రసాద్

(పూజ్యశ్రీ యోగిని శ్రీచంద్రకాళీప్రసాద మాతాజీవారు బెంగుళూరులో 22-12-10 నుండి 26-12-10 వరకు జరిగిన సత్సంగ సమావేశాలలో భక్తులనుద్దేశించి చేసిన బోధామృతాన్ని సంక్షిప్తంగా ప్రచురిస్తున్నాము.)

భగవానుని కరుణ అద్వితీయం, అనంతం, అఖండము అనేది ఆశ్రయించి అనుభవించిన వాడికి తెలుస్తుంది. అది చెప్పుకొనేది కాదు. మనము భగవంతుణ్ణి ఏ రూపంలో ఆశ్రయించినా ఆయన కరుణకి అవధులు ఉన్నాయా? భగవంతుని కోసం ఆలయ నిర్మాణం చేస్తాము. అందులో స్వామిని ప్రతిష్ఠ చేస్తాము. ఆ స్థానంలో ఆలయం నిర్మించక పూర్వం భగవంతుడు లేడా? చూడగల్గినవాడికి కనిపిస్తున్నాడు. చూడలేని వానికి ఆలయం నాలుగు గోడల మధ్యనే కనబడుతున్నాడు. అసలు చైతన్యము నీలో లేదా? దానిని గుర్తించలేక పోతున్నాము. మనస్సు దానిని గుర్తించే స్థితిలో లేదు. ఎందువలన అంటే మనస్సు అనేక బంధాలతో కూడి ఉండటం వలన తనలోనే ఉన్న భగవంతుణ్ణి గుర్తించలేకపోతున్నాడు. అనుక్షణం మానవుడు ఆ భగవానుని అనుగ్రహం పొందుతూనే ఉన్నాడు. ఆ చైతన్యమే లేకపోతే మానవ జీవితం ఎంత? ధనధాన్యాలు, భోగభాగ్యాలు, బంధుమిత్రులు ఎంతమంది ఉన్నా నీలో చైతన్యం తప్పుకుంటే నీ బ్రతుకు ఎంతవరకు. ఈ నిజతత్వాన్ని గుర్తింపజేసే గురుదేవుడు. ఆయన తాను ఏ ఆనందాన్ని అనుభవిస్తాడో దానిని అందరికి అందజేయాలన్నదే ఆయన ఆశ. ప్రపంచంలోని విషయాదులన్ని తాత్కాలికమైనవే. కాని దానిని గుర్తించిన వారెంతమంది? అలా గుర్తించగల్గితే కావలసినది ఏముంది? దేవాలయంలోనే కాదు భగవానుడు కదలడు. స్థిరంగా ఉంటాడు. ఎందువలనంటే కదలటానికి స్థలం ఎక్కడిది? ఆయన సర్వవ్యాపకుడు. మానవుడి దుఃఖానికి కారణం రెండవది ఏదో ఉందన్న ద్వైత భావమే. అద్వైతానుభూతి పొందితే సుఖమే. పగటివేళ నక్షత్రాలు లేవా? సూర్యకాంతిలో నక్షత్రాలను చూడలేము. అదే విధంగా సర్వవ్యాపకంగా భగవానుడు ఎప్పుడూ ఉన్నాడు. ఆయన రూపనామక్రియారహితుడు. ఆయన

మనల్ని తరింపజేయటానికి, తత్త్వాన్ని గుర్తింపజేయటానికి అవతరిస్తున్నాడు. మనము ఆవేదనతో, ఆసక్తితో, అణకువతోఅన్వేషిస్తే గుర్తించగలుగుతాము. ప్రయత్నము ఏకాగ్రత లేనిదే దేనిని సాధించలేము కదా!

అలాగే నిజమైన భక్త హృదయము 'నీ దయ లేనిదే ఏదియు లేదయా' అని ఆవేదన చెందితే ఆయన దయని సాధించ లేమా! ఆత్మ వెళ్ళిన హృదయము అగ్నిహోత్రునిపాలు కాక తప్పదు కదా! పోయేటప్పుడు ఏదైనా వెంట తీసుకువెళ్తున్నారా? ప్రాణం పోయిన తరువాత ఈ దేహాన్ని గురించి ఏం ఆలోచిస్తున్నారు. ఎప్పుడు తీసుకువెళ్తారు అని అడుగుతారు. హాస్పిటల్‌లో మార్చురీలో పెడతారు.

నీ దేహము మార్పుతో కూడినది. ఈ రోజు దేహంలో ఉన్న శక్తి రేపు ఉండకపోవచ్చు. కాని భగవానుడిలో మార్పు లేదు. మనం దేవాలయంలో అలంకరణని మారుస్తున్నాము గాని ఆయన ఏమన్నా మారుతున్నాడా? భగవంతుని ఆశ్రయించి ఈ పదములు నావి అని భావన చేసినవాడికిఅవి వాడికే చెందుతున్నాయి.

నీ భావన మార్పు వచ్చినంత మాత్రాన నీవు ఆశ్రయించిన గురుపదంలో మార్పు వస్తుందా? అవి పరిణామము చెందేవి కావు. జగమే నీదయ అనుకున్నా, జగము నీదేనయ్యా అని భావించినా తేడా ఉందా? నేను నాది అని భావించటంలోనే ఉంది లోపము. భగవంతుడిని 'త్వమేవ' 'త్వమేవ' అని సంబోధిస్తుంటే మనము ఎక్కడ ఉన్నట్లు? సంపూర్ణ శరణాగతి పొందిన నాడే దానిని గుర్తించగలుగుతాడు. *

*తిడితే భగవంతుణ్ణే తిట్టాలి! సత్పురుషులను తిట్టినప్పుడు వారేమీ చేయలేకపోయినా మనస్సులో కష్టపడవచ్చు. దానివల్ల తిట్టినవారికి చెరుపు కలగవచ్చు. వారు కష్టపడకపోయినా వారికేమన్నా పాపం ఉంటే అది తిట్టినవాళ్ళకి వస్తుందని శాస్త్రము.*

*భగవంతుణ్ణి తిడితే ఆయన మనస్సులో కష్టపడరు. ఆయనకు పాపం లేదు. కనుక పాపం వస్తుందని భయపడనక్కర్లేదు. తిడుతూ అయినా తనని తలచుకుంటే చాలునని కదా భగవంతుడు తలుస్తున్నాడు. కాకపోతే శిశుపాలుడికి మోక్షం ఇవ్వటమేమిటి?*

# శ్రీ బాబూజీ దివ్యవాణి

"పోతన విరచితమైన ఆంధ్ర మహాభాగవతమూ, త్యాగయ్య కీర్తనలు పండిత పామర జనరంజకములై బహుల ప్రచారం పొందినవంటే అందుకు కారణం వారు ఉభయులు తమ సహజ పాండిత్యాన్ని రామభక్తితో రంగరించడమే. వారు ఇరువురు రాజాశ్రయాన్నీ, రాజ సత్కారాలను తృణప్రాయంగా తిరస్కరించి అవతారమూర్తి అయిన శ్రీరామచంద్రుని పాదపద్మముల వద్ద తమ సర్వస్వాన్ని అర్పించి చరితార్థులైనారు" అని సమర్థ సద్గురు శ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబు ఉగ్గడించారు.

శుక్రవారంనాడు గుంటూరులోని టి.టి.డి. కళ్యాణ మండపంలో జరిగిన సత్సంగ సమావేశంలో భక్తుల నుద్దేశించి బాబూజీ ప్రసంగిస్తూ భక్తి వైరాగ్య భావాలను పెంపొందించుకొన్న పోతన తాను ఆంధ్రీకరించిన భాగవత గ్రంథాన్ని మాత్రమేగాక తన జీవితాన్ని కూడా పూర్తిగా రామ ప్రభువునకు అంకితం చేసి ధన్యుడైన ఉదంతాన్ని, బాధ్యతలను ఉత్తేజకరమైన రీతిలో బోధపరిచారు. రామనామ జపంతో పోతనకు ఆనందమైన రామశక్తి సమకూరింది. పోతన త్యాగయ్యలేకాదు. జితేంద్రియుడైన హనుమంతుడు రామభక్తితో అపారమైన శక్తిని సాధించి తరించాడు. లంకాధీశుని పన్నాగాలు అతడిని బంధించలేక పోయినవి. శ్రీరామ చంద్రమూర్తిని తప్ప మరొకరిని ప్రభువుగా గుర్తించడానికి జితేంద్రియుడు సమ్మతించక పోవడంతో అతడి అనన్య భక్తి విశ్వాసాలు ప్రస్ఫుటమైనవి.

అలాగే గుహుడు, అహల్య అలాగే వారు పరిపూర్ణమైన రామభక్తికి ప్రతీకలుగా వెలుగొందారని బాబూజీ వివరించారు. భగవంతుని పట్ల ప్రగాఢ భక్తి విశ్వాసాలు పెంపొందించు కొనడంవల్ల అరిషడ్వర్గములు హరించిపోతాయి. మనస్సులోని మాలిన్యం తొలగిపోతుంది. అలాంటి భక్తులలో ఆత్మజ్ఞానం ప్రదీప్తం అవుతుంది. వారికి శాంతి సౌఖ్యాలు లభ్యం అవుతాయి. భగవంతునికి, భక్తులకు మధ్యన అడ్డుతెర తొలగిపోతుంది. చివరకు జననమరణ విషవలయంనుండి విముక్తి కలుగుతుందని బాబూజీ ప్రవచించారు.

చంచల స్వభావంతో కూడిన మనస్సును జయించి భగవాన్ సాక్షాత్కారం పొందడానికి కులమత విభేదాలు ఎంతమాత్రం అడ్డుకాబోవని

బాబూజీ చెప్పారు. భగవంతుడు సత్య స్వరూపుడు, కరుణాసముద్రుడు. ఆయన ప్రేమకు, కటాక్షానికీ అవధులు లేవు. అయితే, కేవలం గ్రంథాలలో నిక్షిప్తమైన విషయాలను తెలుసుకొన్నంత మాత్రాన భగవత్ కృప లభించదు. అందుకు సాధన ముఖ్యం. మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవాలంటే పరమసత్యంపై దృష్టిని కేంద్రీకరించి, దానిని అనుభవ పూర్వకంగా తెలుసుకొనేందుకు కృషి చేయాలని బాబూజీ ప్రబోధించారు. *

పూర్వం గయలో బుద్ధ దేవుడు తపస్సు చేసుకుంటూ ఉండగా ఒక వ్యక్తి వచ్చి అదేపనిగా దూషించటం ప్రారంభించాడు. బుద్ధుడేమీ జవాబు పలకలేదు.

అతగాడు తన అక్కసంతా వెళ్ళబోసుకున్న తరువాత బుద్ధుడు అతనిని పిలిచి 'నాయనా! నీ ఇంటికెవరైనా అతిథి వస్తే అతడిని ఎవరూ లక్ష్యపెట్టకుండా అతడితో మాట్లాడకుండా ఉంటే అతడేమి చేస్తాడు?' అని ప్రశ్నించాడు. '

వెంటనే అతనే తిరిగి వెళ్ళిపోతాడు' అని సమాధానం చెప్పాడు.

'అలాగే నువ్వు నన్ను ఎంతో అపహసించావు. నీ దూషణలను నేను స్వీకరించటం లేదు. కాబట్టి అవి తిరిగి నీ వద్దకే పోయాయి. వాటిని నేను అంగీకరిస్తే అవి నన్ను బాధించి ఉండేవే. కానీ నేను అలా చేయలేదు. నీ సొత్తును నీకే సమర్పించాను' అని బుద్ధుడు గంభీరంగా అన్నాడు.

దాంతో అవతలి వ్యక్తి తెలివి తెచ్చుకొని తన దారిన తాను పోయాడు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

నడవడిలో గాని, హావ భావాలలో గాని ఆ వ్యక్తి లోని దోషాలను పసిగట్టి , సన్మార్గంలో పెట్టే సదుద్దేశంతో, ముందు నెమ్మదిగా మందలించే వారు. అతడు తన తప్పును గ్రహించి తగ్గి మాట్లాడినా, మౌనంగా ఉన్నా, అంతటితో వదిలి పెట్టి ఎంతో ప్రేమతో సన్మార్గాన్ని సూచించి పంపేవారు. అలాగాక అతడు మొరాయిస్తే , బండారం అంతా బయట పెట్టి, శుభ్రంగా క్షాళన చేసి పంపేవారు.



ఎలాగైనా సరే, శ్రీ బాబు వద్దకు వచ్చిన వ్యక్తి కొద్దిగానో, గొప్పగానో మరమ్మతు అయి వెళ్ళవలసినదే గాని, ఊరికే తిరిగి వెళ్ళటానికి వీలు లేదు. మరీ మొండి ఘటమై వినకుండా పోతే, వారం తిరిగే లోపల తల తిరిగి దోసిట్లోకి వచ్చి, 'పాహిమాం' అంటూ శ్రీ బాబు పాదాలపై పడవలసినదే. అందుచేత బారెడు చుట్టల వారైనా, మూరెడు మీసాల వారైనా, మకర కుండలాల వారైనా, మన్మధ మొలకలైనా సరే; ఋజు ప్రవర్తనా, సచ్ఛీలమూ లేని దుర్వ్యసన పరులు, శ్రీ బాబు ఉన్న వీధి గుండా గాక, పక్క సందుల్లోకి తప్పుకొనే వారు గాని, ఎదట పడే సాహసం చేసే వాళ్ళు కాదు. కాని గుండుగొలను గ్రామాన్ని తమ అవతార కార్యంలో ఒక ప్రముఖ కేంద్రంగా చేసుకొన్న శ్రీ బాబు ఆ గ్రామ వాసులకు కాల క్రమంలో ఆప్తులై, అత్యంత సన్నిహితులై, వాళ్ళను సౌమ్యులుగాను, సాధన సంపన్నులుగాను మలచుకొన్నారు. "మా గుండుగొలను గ్రామంలో పెద్ద పులులను, మేకలను, ఒకే చెఱువులో నీళ్ళు త్రాగించిన మహానుభావుడు శ్రీ బాబు" అని ఆ గ్రామంలో యీనాటికీ అభిమానంగానూ, కృతజ్ఞతతోనూ చెప్పుకొనే వాళ్ళు చాలా మంది ఉన్నారు.

శ్రీ బాబు యెడల ప్రగాఢ భక్తి విశ్వాసాలు పెంపొందించుకొని, వారికి అత్యంత ఆత్మీయులైన భక్తులు గుండుగొలనులో ఎందరో ఉన్నారు. వారిలో

శ్రీ బాబుకు ప్రియతములై, తమ తను మనో ధన సర్వస్వములను త్రికరణ శుద్ధిగా సమర్పించుకొని, భక్తి కుసుమాలతో సమర్చించుకొని, సంసేవించుకొని చరితార్థులైన ప్రముఖులు శ్రీ మావులేటి చిరంజీవి రాజు గారు, డా॥ లంక శేషగిరిరావుగారు.

"వారిరువురు నా రెండు కనుల వంటి వారు. శేషగిరీ, చిరంజీవీ నాకు చేసిన సేవలను తలచుకుంటే, నేనే వారికి ఎంతో ఋణపడి ఉన్నానేమో అనిపిస్తుంది" అని చెమ్మగిలిన కనులతో శ్రీ బాబు వాళ్ళను గూర్చి మాటిమాటికి చెబుతూ ఉండేవారు. శ్రీ బాబుతో వారి సాంగత్యాన్నీ, సాన్నిహిత్యాన్నీ గురించి, గుండుగొలనులోని తదితర భక్తులను గురించి, శ్రీబాబు సన్నిధిలో ఆ గ్రామంలో జరిగిన దివ్య సన్నివేశాలను, సంఘటనలను గురించి ముందు ముందు తెలుసుకుందాము.

-సశేషం

జనక మహారాజు ప్రతిదినము ఊరిబైట పర్ణశాలలో ఉండే ఋషిని దర్శించేవాడు. ఆ చక్రవర్తికి గొప్ప ఆతిథ్యమిచ్చి కూర్చోబెట్టి భక్తితో మాట్లాడేవాడు ఋషి. శిష్యులకు కినుకగా ఉండేది. మన గురువుకు రాజరికం మీద మమత భక్తి పోలేదు. చూడు ఆ రాజును ఎంత గొప్పచేస్తాడో అని.

అది కనిపెట్టాడు గురువు. ఒక సాయంత్రం చక్రవర్తితో మాట్లాడుతూ మిథిలానగరం మండిపోతున్న దృశ్యాన్ని కల్పించాడు. శిష్యులు అదిరిపడి 'మహారాజా! తమ నగరం మండిపోతోంది' అని అరిచారు. 'అల్లాగా' అని జనకుడు మామూలుగానే మాట్లాడుతూనే ఉన్నాడు. కాస్సేపటికి శిష్యులు ఆరేసిన గోచీలు మండిపోతున్న దృశ్యం కల్పించాడు. శిష్యులు గొల్లుమని పరిగెత్తారు గోచీలని రక్షించుకోవటానికి.

'చూశారా! నేను జనకుణ్ణి ఎందుకు గౌరవిస్తానో!' అని అడిగాడు గురువు.

# అమెరికాలో శ్రీమాతాజీ

- పద్మజ U.S.A

మనస్సు చేసే దోషాన్ని ఎలా తెలుసుకోవటం దానిని మనస్సుతోనే గుర్తించాలి. గుర్తించటం వరకేకాదు మనస్సుతోనే విచారణ చేయాలి. మనస్సు నిర్మలమై, శుద్ధమై భగవానునికి సమీపమవుతుంది. ప్రశాంతమైన చెరువులో ఒక రాయివేస్తే ఏమవుతుంది? ప్రశాంతతకి భంగం కలిగి కదలికలు వస్తాయి. మానవుని గుణదోషముల వలననే దుఃఖానికి గురవుతున్నాడు. మనస్సే మాయ. అప్రమత్తంగా లేని సాధకుడిని పడవేస్తుంది. సద్గురుమూర్తిని ఆశ్రయించిన వాడికి మాయ అంటే భయం ఎందుకు? మనస్సుతో కూడిన ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్పులేనితనం, మాయ ద్వారా సంక్రమించినవే. మాయ చాలా గొప్పది. మాయ మాయ అని జపం చేస్తే ఏం ప్రయోజనం. దానికి కారణం మనో భావనే కదా! మనలోని దోషాన్ని మనమే సరిచేసుకోవాలి. లేదా సద్గురుమూర్తికి విన్నవించుకోవాలి. దానిని సరిచేసుకునే మార్గాన్ని ఆయన ఉపదేశిస్తారు. మాయ సద్గురుమూర్తి అధీనంలో ఉంటుంది. ఆల్‌శేషియన్ కుక్క ఉంటుంది. అది అంటే ఎవరికైనా భయమే. కలక్టరుగారికి ప్రాణమిత్రుడు ఒకడున్నాడు. తన మిత్రుణ్ణి కలవటానికి వెళ్ళాడు. కలక్టరుగారి యింట్లో ఆల్‌శేషియన్ కుక్క ఉంది. గేటు దగ్గరకి వెళ్ళగానే లోపల నుంచి పరుగు పరుగున వచ్చి గేటు దగ్గర నిలబడి మొరుగుతోంది. అదృష్టవశాత్తు గేటు వేసి ఉంది. లేకపోతే అది అమాంతం ఆ వెళ్ళినవాడి పని అయిపోయేది. ఆ కుక్కని చూసి భయపడి 'కలక్టరుగారూ! కలక్టరుగారూ!' అని బిగ్గరగా పిలిచాడు. కుక్క మొరగటం, గేటు దగ్గర పిలుపు విని కలక్టరుగారు బయటకి వచ్చారు. ఆయన రాగానే కుక్క తలవంచి, తోక కదల్చుతూ ఆయన పక్కనే వెళ్ళి నిల్చుంది. ఇంక వచ్చిన మిత్రునకు భయం ఏముంది? ఎంత ఆల్‌శేషియన్ కుక్కఅయినా యజమాని అదుపు ఆజ్ఞలలో ఉంటుంది కదా! అలాగే మాయ సద్గురుమూర్తికి దాస్యం చేస్తుంది. ఆయన్ని ఆశ్రయించిన వారికి మాయ ప్రభావం ఉండదు. ఆఫీసులకి వెళ్ళి తమ పని పూర్తి అయ్యేవరకు ఎన్ని గంటలైనా అక్కడే ఉండి నిలుచునో, కూర్చునో పని పూర్తి చేయించుకుని వస్తారు. కాని భగవంతుని సన్నిధిలో కూర్చోవటానికి నడుం నొప్పి, కాళ్ళ

నొప్పులు, అవరోధంగా ఉంటాయి. ఏదైనా గృహంలో కార్యం ఉంటే తెల్లవారుఝామున లేచి ఎంతకాలమైనా సరే శరీర శ్రమకి వెరవకుండా కష్టపడతారు. ధ్యానానికి తెల్లవారుఝామున లేవమంటే బద్ధకం. మనం ప్రభువుని ఆశ్రయించనవసరం లేకుండా ఆయనే మనకందరికి ఆశ్రయాన్ని కల్గజేస్తారు. ఆవిషయాన్ని అందరూ గుర్తించండి. దేహము అనాత్మ. ఆత్మ తాను. కాబట్టి ఆత్మానాత్మ విచారణ చేయాలి. మనం ఎలా పిలిచినా పలికేవాడు భగవానుడు. అనంతమైనది గురుశక్తి. ఆ శక్తిని ఒక సీసాలో బంధించటం సాధ్యమేనా! అవతారం ధరించి మనల్ని ఉద్ధరించటానికి వచ్చిన సద్గురుమూర్తి యొక్క శక్తిని అంచనా వేయగల్గిన వారు ఎవరైనా ఉన్నారా! సూక్ష్మాతి సూక్ష్మమైన వటబీజము ఎంతటి నిర్మాణాన్నైనా పడగొడుతుందని మన గురుదేవులు చెప్పేవారు. అలాగే ఎంత చిన్న సంకల్పమైనా మానవుణ్ణి పతనం చేయక మానుతుందా! సాధకుడు మితాహారము, మితనిద్ర, మితభాషణము చేయాలి. వినకూడని మాటలు శ్రవణం చేయటం వలన ఎంతో ఆవేదనకి గురికావటం తప్పదు కదా! గురుబోధామృతం శ్రవణం చేసేటప్పుడు శ్రద్ధ ఉండాలి. శ్రవణం చేసిన బోధని ఆచరణలో పెట్టాలి.

-సశేషం

*శ్లో॥ అర్చనకాలే రూపగతా, సంస్తుతికాలే శబ్దగతా ।*
*చింతనకాలే ప్రాణగతా, తత్త్వవిచారే సర్వగతా ॥*

*1. శక్తిస్వరూపిణియగు జగన్మాతను పూజచేసేటప్పుడు సాకార రూపంలో దర్శించాలి.*

*2. స్తోత్రం చేసేటప్పుడు లేదా నామావళి చదువుచున్నప్పుడు శబ్దగతంగా, శబ్దశక్తిగా ఆ తల్లిని చూడాలి.*

*3. చింతన చేసే సమయంలో శ్రీమాతను ప్రాణగతంగా భావించి అనుభవించాలి.*

*4. అట్లే తత్త్వమును విచారించే స్థితిలో ఆ జగజ్జనని సర్వత్ర, సర్వగతమై అనగా అంతటా, అన్నింటిలో సర్వవ్యాప్తమై యున్నట్లుగా మననం చేయాలి. అనుభవించాలి. దర్శించాలి. ఆ ఆనుభూతిలో ఐక్యం చెందాలి. (ఉమాసహస్రమ్)*

# ఆటవికుని అనన్య భక్తి

- మేధ

శ్రీశంకర భగవత్పాదులవారి శిష్యులలో పద్మపాదుల వారు చాలా ముఖ్యులు. ఆయన బాల్యంలోనే నరసింహ మంత్రోపదేశము పొంది చక్కగా ఉపాసన చేసి నరసింహస్వామిని దర్శించాలనే కోరిక కల్గింది. దానికోసమై అరణ్యంలో ఏకాంత ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని జపానికి ఉపక్రమించారు. ఆ అరణ్యంలో సంచరించే కిరాతకుడు వీరిని చూసి ఆశ్చర్యపోయి ఆయన వద్దకు వెళ్ళి 'స్వామి ఈ ప్రదేశము మీవంటివారు రాదగినది కాదు. క్రూరజంతువులు సంచరిస్తాయి. వాటిని మేము ఎలాగో వేటాడి బ్రతుకుతున్నాము అని అన్నారు.

పద్మపాదులవారు కిరాతకుని మాటలు విని యదార్ధము చెప్పినా తెలియదు, అబద్ధం ఆడటం తగదు అన్న భావనతో నేను నరసింహం అనే జంతువుని సందర్శించటానికి వచ్చాను. అది ఈ ప్రాంతాలలో ఉంటుందని వినికిడి అన్నారు. దానికి కిరాతకుడు ఆశ్చర్యపోయాడు. అడవిలో సింహాలుంటాయి, పులులుంటాయి గాని నరసింహము అనే జంతువు పేరు వినలేదే అని అనుకొని ఆ జంతువుని తాను కూడా సందర్శించాలనే కోరిక కల్గింది. వెంటనే ఆ జంతువు వివరాలు తెలుసుకుని స్వామి చెప్పేది నిజమేనా! ఈ అడవిలో ప్రతి అంగుళము తనకు తెలిసినదే. స్వామి వర్ణించిన జంతువు తనకు కానరాలేదు అని తనలో భావనచేసి ఆ మృగం ఈ అడవిలో ఉంటే దానిని పట్టి రేపు సాయంత్రం లోగా తీసుకువచ్చి తమరికి చూపిస్తాను అని ప్రతిజ్ఞ చేశాడు. అది విని పద్మపాదులవారు నవ్వి ఊరుకున్నారు. వారి నవ్వు చూసిన బోయ పట్టుదలతో స్వామీ నాకు సాధ్యం కానిది లేదు. రేపు సాయంత్రం సూర్యాస్థ సమయంలోగా ఆ మృగాన్ని మీ ముందు ఉంచకపోతే నా ప్రాణం విడిచి పెడతాను. అని వాగ్దానం చేసి నరసింహ అన్వేషణకు ఉపక్రమించాడు.

ఆ బోయవాడు పొదలు, గుట్టలు, పుట్టలు అన్నీ వెదుకుతున్నాడు. నరసింహమూర్తి పద్మపాదులవారు వర్ణించిన విధంగా బోయవాని మనస్సులో ముద్రితమైనది. ఎడతెగని అన్వేషణలో నరసింహుని గూర్చిన ధ్యానం జరుగుతోంది. అన్నం తినాలనిగాని, నీరు త్రాగాలనిగాని అనిపించటంలేదు. అరణ్యమంతా గాలిస్తున్నాడు. ఏకాగ్రత మనస్సుతో వెదుకుతున్నాడు. ఎక్కడా ఆ నరసింహం జాడలేదు. తాను స్వామి వారికి వాగ్దానం చేసిన ఘడియ

సమీపిస్తోంది. తనలో అనుకున్నాడు స్వామి ఎన్నడూ అసత్యం ఆడడు. నరసింహం తప్పకుండా ఈ అరణ్యంలో ఉంది తానే దర్శించ లేకపోతున్నాడు. ఇంక తన బ్రతుకు నిరర్థకం అని భావించాడు.

ప్రాణత్యాగానికి ఒక త్రాడు తయారుచేశాడు. చెట్టుకు కట్టాడు. ఉరిపోసుకుని చనిపోవటమే మిగిలి ఉంది. ఆ బోయవాని అమయాక ఏకాగ్రతకు ప్రసన్నులైన నరసింహ స్వామి అతను ఉరిపోసుకునే సమయానికి ఎదురుగా సాక్షాత్కరించారు.

బోయవాడు తన ఎదురుగా ఉన్న మృగాన్ని చూశాడు. స్వామివారు చెప్పినట్లు సింహపు తల, మనిషి మేను. ఆనందపడిపోయాడు. చెట్టు కొమ్మ మీదనుంచి క్రిందకు దిగాడు. తాను ఉరిపోసుకుందామనుకున్న తాడుతో ఆ మృగాన్ని బంధించాడు. దానిని తీసుకు వచ్చి పద్మపాదుని ఎదురుగా నిలబెట్టాడు. ఆయన బోయవాని వంక ఆసక్తిగా చూసారు.

ఆ బోయవాడు మాట్లాడుతూ 'స్వామీ! ఇదిగో మీరు కోరిన నరసింహ మృగము. తీసుకోండి. ఇంక అరణ్యాన్ని వదిలి సుఖంగా ఇంటికి వెళ్ళండి' అన్నాడు. కానీ పద్మపాదులవారికి బోయవాని చేతిలో త్రాడు తప్ప ఏమీ గోచరించటం లేదు. వారు ఆశ్చర్యంగా చూస్తున్నారు. పద్మపాదులవారికి వాని మాటలు యదార్థములని స్వామి వానికి దర్శనం ఇచ్చారని తనకు మాత్రము కానరావటం లేదని గ్రహించి కన్నీరు కారుస్తూ 'స్వామీ! నేను నిన్ను దర్శించగోరి ఇక్కడకు వచ్చాను. నీవు ఈ పామరునకు నీ దర్శనాన్ని అనుగ్రహించావు. నాకేల కానరావు?' అని దుఃఖించారు.

ఆయనకు ఒక అశరీర వాక్కు వినిపించింది. "కోటి సంవత్సరాలు రూప ధ్యానం చేసినా అలవడని ఏకాగ్రత ఒక్కరోజులో బోయవానికి అలవడింది. ప్రాణాలు పణంగా పెట్టి యోగులకు లభ్యంకాని ఏకాగ్రచిత్తంతో నన్ను అన్వేషించాడు. ఇంతటి మహాభక్తుడైన ఈ కిరాతకునితో సాంగత్య భాగ్యం వలన నా రూపం చూడలేక పోయినా వాక్కు వినగలుగుతున్నావు. నీకు మంత్ర సిద్ధి కలిగింది. నీకు అవసరం అయినప్పుడు నీ దగ్గరకు వచ్చి నీ సంకల్పాన్ని నెరవేరుస్తాను" అని అశరీరవాణి వినిపించింది. ఈ సంఘటన జరిగిన తర్వాతనే పద్మపాదులవారు శంకర భగవత్పాదులవారి శిష్యులయ్యారు. పద్మపాదులవారు పొందిన మంత్రసిద్ధి ఫలితమే కాపాలికుని సంహరించటానికి తోడ్పడింది. *

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గత సంచిక తరువాయి) -వెంకట రమణ ప్రసాద్

"ఎన్నిమారులు ప్రయత్నించినను, ధ్యానమున గేదెయే తోచుచున్నదనియును, బ్రహ్మసాక్షాత్కారమగుల లేదనియు నాతడు తన గురువుతో వినయముగ తన యవస్థను గురించి వివరముగ విన్నవించుకొనెను. జ్ఞానియైన గురువు శిష్యుని పరిస్థితిని గమనించి, అతనికి ఆ మహిషియే బ్రహ్మమని ఉపదేశించెను.

**అనుసృత్య గరుస్నేహం మహిష్యాం తత్వముక్తవాన్**
**తతో యధావద్వేదైవ ప్రతిబంధస్య సంక్షయాత్** (9-42)

ఆ శిష్యుడు గురువునందు విశ్వాసముంచి మహిషినే ధ్యానించి ప్రతిబంధము నశించగా బ్రహ్మసాక్షాత్కారమును పొందెను.

**3. వర్తమాన ప్రతిబంధము**

1. విషయములందాసక్తి. 2. మందబుద్ధి. 3. కుతర్కము. 4. దురాగ్రహము. 5. కర్తృత్వాది ధర్మములు నా యందే యున్నవను అభినివేశమును కలిగియుండుట వర్తమాన ప్రతిబంధ మనబడును. దీనినే శ్రీవిద్యారణ్యులు

**"ప్రతిబంధో వర్తమానో విషయాసక్తి లక్షణః**
**ప్రజ్ఞామాంద్యం కుతర్కశ్చ విపర్యయ దురాగ్రహః**

అని నిర్వచించిరి. 'ప్రజ్ఞామాంద్య' మనగా మందబుద్ధి. 'కుతర్క' మనగా కుత్సితమైన లేక లోపభూయిష్టమైన యుక్తి .'దురాగ్రహ' మనగా "ఎవరు చెప్పిననూ నేను వినను" అను మూర్ఖ నిర్ణయమునకు వచ్చుట. 'విపర్యయ' మనగా (నిజముగా నాత్మ చేతనే అంతఃకరణము ప్రకాశింపజేయబడిననూ) "నేనే అన్నికార్యములకు కర్తను, భోక్తను" అని భావించు అహంకారము.

నాలుగు భాగములుగా ఉన్న ఈవర్తమాన ప్రతిబంధమును తొలగించుకొనుటకు కూడ శాస్త్రములు సాధకునకు కొన్ని మార్గములు చెప్పినవి. "వాసుదేవ మననము"న సప్తదశ వర్ణకమునందు వీనికి నివృత్తి చెప్పబడినది. "వీనికి నివృత్తి యెటులనిన శమదమోపరతి తితీక్షల వలన విషయాసక్తి లక్షణంబును, పునః పునః శ్రవణము చేయుట వలన ప్రజ్ఞామాంద్యంబు, మననము వలన కుతర్కంబును, నిదిధ్యాసనము వలన విపర్యాప దురాగ్రహంబును పోవును. ఈ ప్రకారంబున ప్రతిబంధమునకు నాశము

వచ్చుచుండగా, ముముక్షువులైనవారికి తానే ఆత్మస్వరూపమను నిశ్చయంబు బుద్ధియందుగలుగును.

విషయముల ననుభవింప వలెనను కోరిక 'ఆనందము బయట నుండి వచ్చుచున్నదని' తప్పుగా ఆలోచించుట వలన కలుగుచున్నది. నిద్రలో మనకన్నిటికన్న ఎక్కువ సుఖము కలుగుచున్నది. ఆ సుఖమును కలిగించు విషయమేమి? 'ఏమియునూ లేదు. ఆత్మయే' అను జ్ఞానమెప్పుడు కలుగునో అప్పుడు విషయములందలి ఆసక్తి క్షీణించుట సహజము. ఈ జ్ఞానము నిత్యానిత్య వివేకము వలనను, శమదమోపరతి తితిక్షల వలనను కలుగును.

'వినగ వినగరాగ మతిశయిల్లుచునుండు' నన్నట్లు వినగ వినగ ప్రజ్ఞామాంద్యము నశించి కుశాగ్ర బుద్ధియై శ్రవణమునకు అధికారి యగును. అట్లు శ్రవణము చేసిన దానిని మరల మరల మనస్సునకు దెచ్చుకొనుటయే మననము. అయినను సందర్భము వచ్చినది గనుక నిచట శ్రవణాదుల గురించి కొంత చర్చించుట యవసరము.

**శ్రవణము**

శ్రవణమనగా వేదాంత శాస్త్రమును స్వయముగా చదివి గాని, గురుముఖమున వినిగాని వేదాంత శాస్త్రజన్య జ్ఞానమును సంపాదించి గాని, మహావాక్యముల యొుక్క అర్థమును చక్కగా తెలుసుకొనవలెను. ఉత్తమాధికారికి కేవల శ్రవణ మాత్రముననే మోక్షము కలుగునని శ్రీశంకర భగవత్పాదులు నిస్సంశముగ చాటిరి.

**అధ్యారోపాప వాదక్రమమను సరతాదేశికేన్మాత్ర**
**వేత్రా వాక్యార్థీ బోధ్యమానేసతి సపదిశుద్ధ బుద్దేరముష్య**
**నిత్యానందాద్వితీయం నిరుపమమలం యత్పరం తత్వమేకం**
**తద్బ్రహ్మావా zహమస్మీత్యుదయతి పరమాఖండ తాకార వృత్తిః**

(స.వే.సి.సం.787) "అధ్యారోపవాదములలో అపవాదక్రమమనుసరించి గురువు మహావాక్యము బోధించుచుండగా తత్కాలమందే నిర్మల చిత్తుడై యున్న యతనికి (శిష్యునికి) నిత్యము, నిర్మలము, ఏకమునగు ఏ పరతత్వముగలదో ఆ బ్రహ్మమే నేనగుదును అను నఖండాకార వృత్తి గలుగుచున్నది. కాని యీ విధముగ శ్రవణ మాత్రముననే సాక్షాత్కారమును సాధించిన వారు అరుదు. వరుణుని వలన ఆయన పుత్రుడు భృగువు, ఉద్దాలకుని వలన శ్వేతకేతువు శ్రవణ మాత్రమున కృతకృత్యులైనట్లు శ్రుతి స్మృతులు చెప్పుచున్నవి.

-సశేషం

# అమరనీతి నాయనార్

ఆంగ్లమూలం- ఆర్. సంపత్, తెలుగు అనువాదం - సుషుమ్నా ప్రసాద

భగవంతునకు తన భక్తులపై చాలా మక్కువ. వారి ప్రగాఢ భక్తిని ప్రకటించి, వారి ఆరూఢ భక్తిని నిరూపించటానికి పరమశివుడు వారిని క్లిష్ట పరిస్థితులకు లోను చేసి, పరమాత్మ లీలలను ప్రదర్శిస్తుంటారు. ఆరూఢమైన భక్తులు మాత్రం విషమ పరిస్థితులను ఎదుర్కొని పరమేశ్వరునిలో లయమవుతారు. తమిళ ప్రబంధంపెరియ పురాణములో 63 మహాభక్తుల గాథలలో, ఒక మహాభక్తుని గాథని ఇక్కడ వివరిస్తున్నాను.

తమిళనాడులో కుంబకోణం సమీపంలో 'నాల్లురు' యనే గ్రామమున్నది. అక్కడ వైశ్యకులంలో అమరనీతి యనే మహా శివభక్తుడు ఉండేవాడు. అతను సదాశివునకు సంపూర్ణ శరణాగతుడై ఎంతో కరుణతో మానవసేవ చేయటమే తన ధ్యేయంగా పెట్టుకోమన్నాడు. ఆయన వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతున్నది. అంతేకాక ఆ గ్రామానికి వచ్చే శివభక్తులకు అపూర్వమైన ఆతిథ్యము నందజేసేవాడు. భక్తుల సౌకర్యార్థము ఒక సత్రాన్ని నిర్మించి, దాని పర్యవేక్షణ తాను స్వయంగా చూసేవాడు. భక్తులకు సౌకర్యాలు చక్కగా అందుతున్నాయా లేదా అని శ్రద్ధతో సేవచేసేవాడు. ఆ గ్రామములోని శివాలయమునకు భక్తులు తండోపతండాలుగా వచ్చేవారు. వారందరికి అమరనీతి సత్రంలో ఉన్నంతకాలము ఆ భక్తుల ఆతిధ్యానికి లోటు లేకుండా ఆహారము, వస్త్రములు, పడకలు ఏర్పాటు చేసేవాడు. కాలక్రమేపి అమరనీతి ఆతిథ్యము ఆ ప్రాంతమంతా ప్రసిద్ధి చెందినది.

భక్తుడు అమరనీతి చేయుచున్న ప్రజాసేవకు పరమేశ్వరుడు ముగ్ధుడై అతను నేనింత గొప్ప ఆతిథ్యము నిస్తున్నానని, లేశమైనా గర్వము పొడ చూపిందేమోనని పరీక్షించ సంకల్పించాడు. ఒకరోజు పరమేశ్వరుడు సన్యాసి వేషధారియై జీర్ణ వస్త్రాన్ని ధరించి, రెండు కౌపీనాలను వేలాడేసిన చేతి కఱ్ఱతో, మండుటెండలో నాల్లూరు గ్రామమునకు వచ్చి, సత్రములో వసతి కావాలని కోరాడు. అమరనీతి ఆ భక్తుని చూడగానే పరవశించి, అతని ముఖారవిందమందు గోచరిస్తున్న దివ్యతేజస్సుకు కళ్ళు తిప్పుకోలేక పోయాడు. ఆ సన్యాసికాతిథ్యం ఇవ్వటానికి అవకాశమివ్వమని విజ్ఞప్తి చేశాడు.

ఆ సన్యాసి చురునవ్వుతో అమరనీతి, ఆతిధ్యానికి అంగీకరించి, ముందుగా సమీపంలో ఉన్న నదీస్నానం చేసి వస్తానన్నాడు. ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైనది. వెంటనే సన్యాసి ఆకాశం వంక చూస్తూ, బాగా వర్షం వచ్చేటట్లు ఉన్నది. వర్షం వల్ల బాగా తడిసిపోతానేమోనని భయంగా ఉన్నది. అందుచేత మార్చుకోవటానికి ఒక కౌపీనాన్ని ఇక్కడ ఉంచి పోతానన్నాడు. అందులకు అమరనీతి సంతోషంతో అంగీకరించి, ఆ కౌపీనాన్ని భద్రపరుస్తానన్నాడు.

అనుకొన్నరీతిగా, కుండపోతగా వర్షం కురిసింది. నది నుండి పూర్తిగా తడిచి సన్యాసి సత్రం చేరుకొన్నాడు. రాగానే అమరనీతిని తాను మార్చుకోవటానికి, కౌపీనం తెచ్చియివ్వమని అడిగాడు. అమరనీతి వెంటనే కౌపీనం తెద్దామని వెళ్ళాడు. కాని కౌపీనం గోచరించక, భయవిహ్వాలుడైనాడు. ఆ భవనంలో అన్ని మూలలా వెతికాడు. కాని ఫలితం శూన్యం. విచారగ్రస్తుడై, సన్యాసితో కౌపీనం మెక్కడా కనబడలేదన్నాడు.

ఆ మాటవినగానే సన్యాసి ఆగ్రహావేశమునకు లోనై 'అది నేనెంతో ఇష్టపడిన పవిత్రమైన వస్త్రం. నాకు చాలా సంకటమైన పరిస్థితిని సృష్టించావు. నా వస్త్రం పూర్తిగా తడిసిపోయింది. నేనిప్పుడేమి ధరించాలి?' అని ప్రశ్నించాడు. అమరనీతి తాను నిర్దోషినని, ఆ కౌపీనమెలా మాయమయిందో తనకు తెలియదని వేడుకొన్నాడు. అందులకు సన్యాసి ఒప్పుకోక 'నీ కాకమ్మ కథలు నాకు చెప్ప వద్దు. నీవు ఖచ్చితంగా నన్ను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నావు. నీవు నా కౌపీనాన్ని హరించేంతటి నీచుడవా?' అన్నాడు. ఆయన పెద్ద గావుకేకలు వేస్తుంటే, సత్రంలో ఉన్న జనమంతా అక్కడకు వచ్చారు.

అందులకు అమరనీతి ప్రశాంతంగా 'అయ్యా! నేనంతటి నీచ కార్యానికి ఎందుకు ఒడిగడతాను? నాకు సంపదకు కొరవా? మీకంతకంటె మంచి కౌపీనములు కొనిపెట్టగలను' అన్నాడు.

అప్పుడు సన్యాసి 'ఓహో! నీవంతటి సంపన్నుడవా? అయితే నా కౌపీనానికి సరితూగగల కౌపీనాన్ని ఇవ్వమని తన కర్రకు తడిసి ముద్దయిన కౌపీనాన్ని చూపించాడు.వెంటనే అమరనీతి ఊరిపి పిల్చుకుని త్రాసు తెప్పించాడు. త్రాసుకు మరొకవైపు తక్కెటలో సన్యాసి కౌపీనాన్ని ఉంచి రెండవవైపు తక్కెటలో నూతన పట్టు కౌపీనాన్ని ఉంచాడు. త్రాసు ముల్లు ఇటువైపు మొగ్గుచూపలేదు. సన్యాసి కౌపీనం వేసిన తక్కెడ బరువుగా

భూమినానుకొని ఉన్నది. తరువాత ఇంట్లో ఉన్న కౌపీనాలు, అందరి వస్త్రాలు బేళ్ళు తెప్పించి తక్కెటలో వేసినా సన్యాసి కౌపీనం వేసిన తక్కెటవైపే త్రాసు మొగ్గుచూపుతున్నది. ఇది మహా విచిత్రంగా గోచరిస్తున్నది. అమరనీతి దిగ్భ్రాంతుడై సన్యాసి అనుజ్ఞ తీసుకుని ఇంట్లో ఉన్న యావత్తు బంగారము, వెండి, నగలు, నగదు అన్నీ తెప్పించి తక్కెటలో వేశాడు. కానీ సన్యాసి కౌపీనం ఉన్న తక్కెట బరువుగా ఉండి నేలను తాకుతున్నది. ఈ దృశ్యాన్ని చూసి అక్కడ ఉన్న యావన్మంది ఆశ్చర్యచకితులై నోటమాటరాలేదు.

అమరనీతి అతిథి పాదారవిందాలకు సాష్టాంగ నమస్కారముచేసి, వినమ్రుడై 'స్వామీ! మిమ్మల్ని తక్కువగా అంచనా వేసినందుకు క్షమించండి. ఇప్పుడు నన్ను, నా భార్యను, పిల్లలను కుడివైపున తక్కెటలో కూర్చోవటానికి అనుజ్ఞ ఇవ్వమని మీకు సదా సేవకులమై ఉంటాము' అన్నాడు. అమరనీతి సంతానసమేతంగా తక్కెటలో కూర్చోగానే తృటికాలంలో త్రాసు వీరివైపు మొగ్గింది. అన్నిటికంటె మహదాశ్చర్యంగా సన్యాసి అదృశ్యమయ్యాడు. అక్కడున్న వారందరూ ఒక దివ్యవాణిని విన్నారు. ' నా ప్రియమైన అమరనీతి ప్రపంచానికి నీ నిరుపమానమైన నీ భక్తిని వెల్లడించడానికే ఈ నాటకమాడాను. ఈ భూమిపై మరికొంత కాలము నీ మానవ సేవ కార్యక్రమాన్ని కొనసాగించు. తగిన సమయం రాగానే నాలో ఐక్యం చేసుకొంటాను' అని అభయం ఇచ్చాడు పరమేశ్వరుడు. అప్పటి నుంచి అమరనీతి అందరిచేత నాయనార్ అని పిలవబడ్డాడు. *

*గోపికలకు కృష్ణుడంటే ప్రేమ. వారు ఆయన్ను వదలలేరు. ఆయన అధరామృతం వారికే స్వంతం కావాలన్న తపన ఉన్నది వాళ్ళకి!*

*కాని మురళీ అలా కాదు. దానికి ఏదీ అక్కర్లేదు. అన్నీ అందరికీ పంచి ఇవ్వటమే దాని లక్షణం. ఆయన మధురాధరాలలో నుండి వచ్చిన మధుర మంద్ర గానాన్ని కూడా తనలో ఉంచుకోవాని అనుకోదు వేణువు. స్వార్థం లేదక్కడ. త్యాగానికి పరాకాష్ఠ మాత్రమే ఉన్నది. అదే ప్రభువుకు నచ్చేది. అందువల్లనే అది గోపికలకంటే కూడా ప్రియతమమై ఆయన పేరుముందు చేరి వంశీమోహనుణ్ణి చేసింది. ఆయనకు అత్యంత ప్రియతమమై, ఆయన బొడ్డులోనే కాపురం పెట్టింది మురళి!*




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

కాని ఈ క్షణంలో... కాళిందిలో నుంచి పైకి వస్తున్న ఆకృతి... తానైతే ఎప్పుడూ చూసి ఉండలేదు.... సంజయుడు ధృతరాష్ట్రునికి చేసిన వర్ణన.... ఆవిశ్వరూప దర్శనం ఇదేనా?... ఉద్ధవుడు కళ్ళు పెద్దవిగ చేసి చూస్తున్నాడు.... అతని చెవులు నిక్క పొడుచుకున్నాయి.... - అనేక ముఖములతో, అనేక నేత్రములతో, అనేక అద్భుత ఆకృతులతో, అనేక దివ్యాభూషణములతో, అనేక ఆయుధములతో, అనేక దివ్యమాలలు, దివ్య అస్త్రములు ధరించి, దివ్య గంధాను లేపితుడై ప్రకాశమానుడై అనంతుడు, అనాది, అనంద్యుడు, కోటి సూర్యుల తేజము కలిగి ఉన్న ఆ రూపం ఉద్ధవుని కనులలో స్థిరంగా నిలిచిపోయింది.

ఇదేనా విశ్వరూప దర్శనము? ఇదేనా విశ్వదేవుని నివాసము?

"అక్రూరా నువ్వు విశ్వదేవునిలో వాసం చేస్తావు...!" అని కృష్ణుడు అక్రూరునితో అన్నమాట ఇప్పుడు నిజమౌతోందా?

"వత్సా కళ్యాణమస్తు!" అక్రూరుడు నీటిలో ముందుకు సాగాడు. నీటి వలయంలో నుంచి ఆకృతిలో తానున్నాడు. "కృష్ణుని మాటలు యదార్థం అవుతున్నాయి వత్సా" అన్నాడు అక్రూరుడు.

ఉద్ధవుడు కూడా యాదవుడే కదా ఉద్ధవా!" అన్నాడు అక్రూరుడు.

అతని భుజం దాకా నీళ్ళు వచ్చాయి. "నేను జీవించి ఉన్నంత వరకు గాంధారి మాటలు ఎలా సిద్ధిస్తాయి.."

ఉద్ధవుడి బుద్ధి మెరుపులాగా పనిచేస్తోంది. అక్రూరుడు చెప్పేది నిజమే! గాంధారి మాత కృష్ణుని వంశం సర్వనాశనం కావాలి అని శాపం ఇచ్చింది! కృష్ణ బలరాములు యాదవులందరు ప్రభాస క్షేత్రంలో విలీనమైయ్యారు. వసుదేవుడే స్వయంగా దేహత్యాగం చేసి గాంధారి మాటను నిజం చేశాడు! ఇక మిగిలింది అక్రూరుడు..... అక్రూరుని పార్థివ శరీరం అనంత వాయువులలో లీనం కానంతవరకు, కృష్ణవంశం వినాశం పూర్తి కానట్లే కదా.

"ఏ విధంగా అర్జునుడు వసుదేవునికి వీడ్కోలు పలికినట్లు, అదే విధంగా ఉద్ధవా నువ్వు కూడా..... సర్వ కళ్యాణార్థం ఇక్కడ అంజలి అర్పించు నాయనా....!" అన్నాడు అక్రూరుడు.

ఉద్ధవుడి మనస్సులో కలకలం మొదలైంది - "నేను అక్రూరుని ఎందుకు ఆపలేక పోతున్నాను? జర్జర దేహధారుడైన అక్రూరునికి ఈ దేహత్యాగం అతని మనస్సును ఆందోళన పరచటం లేదా?... దేహత్యాగమే తక్షణ కర్తవ్యం అని, పరమ శాంతి ప్రదాయకమైన భావన మనస్సులో ఎందుకు వస్తున్నది?"

ఉద్ధవుడు కాళిందిలో వస్తున్న నీటి వలయాలను చూస్తున్నాడు.

ఆకాశము, పృథ్వి, సర్వదిశలా వ్యాప్తమైన రూద్ధ, మరూత, ఆదిత్య, వస్తు, సిద్ధులను కూడదీసుకుని ఏ విధంగా నదీ ప్రవాహాలు సాగరం వైపు ప్రవహిస్తాయో, ఆ ప్రకారం సమగ్ర మనుష్యలోకం ఆ ఆకృతిలో ఏకరూపం అవుతుంటే....

ఉద్ధవుడు చూస్తున్నాడు!

అక్రూరుని కనులు మాత్రమే నీటి మట్టానికిపైన ఉన్నాయి... నీటి అలలో కంపనం.... అక్రూరుడు ప్రవాహంలోంచి తన కుడి చేతిని పైకి ఎత్తాడు.... ఒక ధ్వని వినిపించింది - "కళ్యాణమస్తు...."

ఏ విధంగా వనంలో వీచే వాయువు స్తంభించిపోతుందో, అగ్ని వేడిమిని కోల్పోతుందో.... అకాశం సర్వ వ్యాపకమైనా అసంగంగా ఉంటుందో... పృథ్వి సర్వ ప్రాణికోటులను భరించినా, ప్రాణులు తమ కర్మానికి అధీనులో... జలం స్థిరముగాను, గతిశీలము కూడాను ఉంటుందో... అదే విధంగా యోగి పురుషుడు ఆత్మతత్వాన్ని స్వీకరించాలి... అగ్ని సమగ్ర సృష్టిని భక్షణ చేసినా ఆకలిగా ఉంటుంది....

యమునా ప్రవాహం ఉదృతం అయింది. కెరటాలు శబ్దం చేస్తున్నాయి.... అక్కడ మేస్తున్న ఆవుల మెడలోని గంటలు మ్రోగాయి.... ఉద్ధవుడు చేతులు జోడించి తలవంచి మ్రొక్కాడు.... నీటికి క్షణకాలం శూన్యత... తరువాత పూర్వ ప్రకారంగా నీరు ప్రవహించసాగింది... అక్రూరుడు జల సమాధి అయ్యాడు.

"కృష్ణా... కృష్ణా....!" ఉద్ధవుడు కనులు మూసుకున్నాడు. 'మీరు చెప్పారే అవే ఈ పంచభూతములు...' వికల మనస్కుడై రెండు చేతులతో నీరు

నింపుకుని అంజలి అర్పించాడు...

'అక్రూర మహాశయా! విశ్వదేవుల లోకంలో మీరు వసింతురుగాక... సోమాయ... అగ్రయె - యమాయ - స్వధా నమః'

ఉదయాగ్నినుండి అరుణ కాంతులు వెలువడుతున్నాయి. ఉద్ధవుడు మధుర వైపు చూశాడు. క్రితం రాత్రి తాను మధురలోకి ప్రవేశించిన క్షణం జ్ఞప్తికి వచ్చింది.... మధురలో తనని గుర్తు పట్టేవారు ఇక ఎవరూ లేరు....

ఇక ఒకే ఒక కార్యం మిగిలి ఉన్నది...

ఉద్ధవుడు గోకులం వైపు దృష్టి సారించాడు... మార్గంలో ధూళిని స్పృశించాడు. ఈ మార్గంగుండానే కృష్ణుడు గోకులం నుండి మధురకు వచ్చాడు... స్వయంగా అక్రూరుడే తనతో తీసుకువచ్చాడు.... ఈ మార్గంలోనే తాను ముందుకు పయనిస్తాడు. దూరంగా గోకులం కానవస్తోంది. ఉద్ధవుడి అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి. వ్రజభూమికి వెళ్ళే మార్గం ఇక్కడి నుండే మొదలౌతుంది. ఉద్ధవుడు ఈ రెండు మార్గాల కూడలిలో నుంచొని ఉన్నాడు. మధుర వెనక పడిపోయింది. కుడివైపు గోకులం, ఎడమవైపు వ్రజ భూమి.... ఉద్ధవుని రెండు కనుల వలె మెరుస్తున్నాయి.

ఎదురుగా యమున. ఆ ప్రవాహంలోనే కొద్ది సేపు క్రితమే అక్రూరుడు విలీనమైనాడు... తటం దగ్గర ఉన్న ఒక రాయిపైన ఉద్ధవుడు కూర్చున్నాడు.

చిన్న చిన్న వృక్షాలు, ఏపుగ ఎదిగిన గడ్డినుంచి కదలిక అయింది. ఉద్ధవుడు అటువైపు చూశాడు - ఒక పాము ఆ దిశగా పాకుతూ వెళ్ళింది. ఉద్ధవుని కళ్ళు విస్ఫారితమైనాయి. అతనికి కాళియనాగు స్మరణకు వచ్చాడు. ఇక్కడే దగ్గరలోనే నిలబడి కృష్ణుడు ఉద్ధవుడితో అన్నాడు -

"ఉద్ధవా! గ్రీష్మంలోని ఎండలు మండుతుంటే, ఈ జలాశయాన్నుంచి నీరు తీసుకోకుండా గోపీకాంతలు దూరంనించి నీరు ఎందుకు తెచ్చుకుంటున్నారు?

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL